


# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | గురువారం 01-01-2026 | సంపుటి - 26 | సంచిక -224 | రూ : 4 | పేజీలు: 8





## కిటకిటలాడుతున్న వనం..
# ముందస్తు మొక్కుల్లో మేడారం భక్తులు!



2లో

- వచ్చే నెల 28 నుంచి మహాజాతర ప్రారంభం
- ఇప్పటి నుంచే పోటెత్తుతున్న భక్తులు
- ఎత్తుబెల్లం, యాటలతో మొక్కులు తీర్చుకుంటున్న భక్తజనం
- రూ.251 కోట్లతో మేడారంలో అభివృద్ధి పనులు



2లో

## "ఏ ఫర్ ఆంధ్రా"...
## 'మనీకంట్రోల్' ఇదే చెబుతోంది

- మనీకంట్రోల్ 2025 టెక్ అండ్ స్టార్టప్ గైడ్ విడుదల
- ఏ-జెడ్ లిస్ట్‌లో 'ఏ' ఫర్ ఆంధ్రా అంటూ ఏపీకి ప్రత్యేక గుర్తింపు
- ఇండియాస్ న్యూ టెక్ డార్లింగ్ ఏపీనే అన్న మంత్రి నారా లోకేశ్
- రాష్ట్రంలో టెక్నాలజీ అభివృద్ధికి ఇది నిదర్శనమని ట్వీట్

## ఒకే లాంచర్ నుంచి రెండు 'ప్రళయ్' క్షిపణులు...
# ప్రయోగం విజయవంతం

- భారత్ అమ్ములపొదిలో మరో అస్త్రం 'ప్రళయ్'
- వరుసగా రెండు మిసైల్స్ పరీక్ష విజయవంతం
- 150 నుంచి 500 కిలోమీటర్ల లక్ష్యాలను ఛేదించే సత్తా
- డీఆర్డీవో శాస్త్రవేత్తలను అభినందించిన రాజ్‌నాథ్ సింగ్
- త్వరలోనే సైన్యంలో చేరనున్న ప్రళయ్ క్షిపణులు



2లో

## 2026 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన
# సీఎం రేవంత్ రెడ్డి

- తెలంగాణ రైజింగ్ విజన్ 2047 లక్ష్య సాధన దిశగా పయనిస్తున్నట్లు వెల్లడి
- అన్ని వర్గాల ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని వెల్లడి
- ప్రతి కుటుంబం ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్ష



2లో



2లో

## హైదరాబాద్ లో
# రాత్రి 10 నుంచి ఫ్లైఓవర్లు బంద్..

- 8 గంటల నుంచే డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు
- న్యూ ఇయర్ వేడుకలను ప్రశాంతంగా జరపడంపై పోలీసుల దృష్టి
- కఠినమైన ట్రాఫిక్ నిబంధనలను అమల్లోకి తెచ్చిన నగర పోలీసులు
- ఫ్లైట్ టికెట్ ఉంటేనే పీవీ ఎక్స్‌ప్రెస్ హైవే పైకి అనుమతి

## కొత్త ఏడాది మీకందరికీ
# మంచి జరగాలి

- నూతన సంవత్సర శుభాకాంక్షలు అంటూ సీఎం చంద్రబాబు ట్వీట్
- ఒక రోజు ముందుగానే పింఛను సొమ్ము అందిస్తున్నామన్న సీఎం చంద్రబాబు
- తమ ప్రభుత్వం ఇప్పటి వరకూ 50వేల కోట్లకు పైగా పింఛన్ల కోసం ఖర్చు చేసినట్లు వెల్లడి

2లో



# ఒకే లాంచర్ నుంచి రెండు 'ప్రళయ్' క్షిపణులు... ప్రయోగం విజయవంతం

ఒడిశా: భారత రక్షణ రంగం మరో కీలక మైలురాయిని చేరుకుంది. బుధవారం ఒడిశా తీరంలో ఉపరితలం నుంచి ఉపరితలానికి ప్రయోగించే స్వల్ప శ్రేణి బాలిస్టిక్ క్షిపణి 'ప్రళయ్'ను భారత్ విజయవంతంగా పరీక్షించింది. ఒకే లాంచర్ నుంచి రెండు క్షిపణులను స్వల్ప వ్యవధిలో ప్రయోగించి వాటి సామర్థ్యాన్ని విజయవంతంగా పరిశీలించారు. యూజర్ ఎవాల్యుయేషన్ ట్రయల్స్‌లో భాగంగా ఈ పరీక్షలు నిర్వహించినట్లు రక్షణ శాఖ వెల్లడించింది. బుధవారం ఉదయం 10:30 గంటల సమయంలో రక్షణ పరిశోధన మరియు అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ ప్రయోగం జరిగింది. ప్రయోగించిన రెండు క్షిపణులు నిర్దేశిత మార్గంలో ప్రయాణించి, లక్ష్యాలను కచ్చితత్వంతో ఛేదించాయని అధికారులు తెలిపారు. చాందీపూర్ ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్‌లో మోహరించిన ట్రాకింగ్ సెన్సార్ల ద్వారా క్షిపణి పనితీరును ధృవీకరించుకున్నారు. డీఆర్డీవో సీనియర్ శాస్త్రవేత్తలు, ఆర్మీ, ఎయిర్ ఫోర్స్ ఉన్నతాధికారులు ఈ ప్రయోగాన్ని ప్రత్యక్షంగా వీక్షించారు. 'ప్రళయ్' క్షిపణి 150 నుంచి 500 కిలోమీటర్ల పరిధిలోని లక్ష్యాలను ఛేదించగలదు. ఇది పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన సాలిడ్ ప్రొపెల్లెంట్ క్వాసీ బాలిస్టిక్ మిసైల్. అత్యాధునిక నావిగేషన్, గైడెన్స్ వ్యవస్థలతో పనిచేసే ఈ క్షిపణి.. వివిధ రకాల వార్‌హెడ్‌లను మోసుకెళ్తూ శత్రువుల స్థావరాలపై విరుచుకుపడగలదు. హైదరాబాద్‌లోని రీసెర్చ్ సెంటర్ ఇమారత్ తో పాటు పలు డీఆర్డీవో ల్యాబ్స్, భారత్ డైనమిక్స్ లిమిటెడ్ వంటి సంస్థల సహకారంతో దీనిని అభివృద్ధి చేశారు. ఈ ప్రయోగం విజయవంతం కావడం పట్ల రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హర్షం వ్యక్తం చేశారు. సాల్వో లాంచ్ విజయవంతం కావడంతో క్షిపణి విశ్వసనీయత నిరూపితమైందని ఆయన పేర్కొన్నారు. ఈ విజయంపై డీఆర్డీవో చైర్మన్ డాక్టర్ సమీర్ వి కామత్ మాట్లాడుతూ.. త్వరలోనే ఈ క్షిపణి వ్యవస్థను సైన్యంలోకి ప్రవేశపెట్టేందుకు సిద్ధంగా ఉన్నామని, ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు తుది దశలో ఉన్నాయని తెలిపారు.

## 2026 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు 2026 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రైజింగ్ విజన్ 2047 లక్ష్య సాధన దిశగా పయనిస్తున్నట్లు పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. కొత్త ఏడాది ప్రతి కుటుంబం ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు. 2026 సంవత్సరంలో అభివృద్ధి, ప్రజా సంక్షేమంలో తెలంగాణ వేగవంతమైన పురోగతిని సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. 2026 నూతన సంవత్సర వేడుకలకు హైదరాబాద్ నగరం ముస్తాబైంది. నగరంలో వివిధ ప్రాంతాల్లో కొత్త సంవత్సర వేడుకలు ప్రారంభమయ్యాయి. అర్ధరాత్రి 12 గంటల వరకు వినోద కార్యక్రమాలు నిర్వహించి 2026 సంవత్సరం రాగానే పరస్పరం శుభాకాంక్షలు చెప్పుకుంటారు. కొత్త సంవత్సరంలోకి అడుగుపెట్టబోతున్న తరుణంలో రాజకీయ, సినీ, క్రీడా ప్రముఖులు సామాజిక మాధ్యమాల వేదికగా శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

## హైదరాబాద్ లో రాత్రి 10 నుంచి ఫ్లైఓవర్లు బంద్..

హైదరాబాద్: న్యూ ఇయర్ వేడుకలను ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నిర్వహించేందుకు హైదరాబాద్ పోలీసులు కఠినమైన ట్రాఫిక్ ఆంక్షలు అమల్లోకి తీసుకొచ్చారు. డిసెంబర్ 31 రాత్రి 11 గంటల నుంచి జనవరి 1 తెల్లవారుజామున 2 గంటల వరకు ఈ ఆంక్షలు కొనసాగనున్నాయని ఇన్‌చార్జ్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ వెంకటేశ్వర్లు వెల్లడించారు. నగరంలో భారీగా జనం కదలికలు ఉండే ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బేగంపేట, టోలీచౌకీ ఫ్లైఓవర్లకు మినహాయింపు ఇస్తూ, మిగిలిన ఫ్లైఓవర్లన్నింటినీ పరిస్థితిని బట్టి రాత్రి 10 గంటల నుంచి జనవరి 1 ఉదయం వరకు మూసివేయనున్నట్లు పోలీసులు స్పష్టం చేశారు. నగరంలోకి వచ్చే అన్ని ప్రైవేటు వాహనాలను ఔటర్ రింగ్ రోడ్ మీదుగా మళ్లించాలని సూచించారు. ముఖ్యంగా ట్యాంక్‌బండ్, నెక్లస్ రోడ్, ఎన్‌టీఆర్ మార్గ్ వంటి రద్దీ ప్రాంతాల్లో రాత్రి 11 నుంచి 2 గంటల వరకు వాహనాల రాకపోకలను పూర్తిగా నిషేధించారు. భద్రతను మరింత కట్టుదిట్టం చేసేందుకు నగరవ్యాప్తంగా 217 ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. షాపింగ్ మాల్స్, పబ్‌లు, పార్టీ హబ్‌లుగా మారే ప్రాంతాలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. పీవీ ఎక్స్‌ప్రెస్ హైవే పైకి వెళ్లాలంటే తప్పనిసరిగా ఫ్లైట్ టికెట్ చూపించాల్సిందేనని స్పష్టం చేశారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు రాత్రి 8 గంటల నుంచే ప్రారంభమవుతాయని, ర్యాష్ డ్రైవింగ్, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనపై జీరో టాలరెన్స్ విధానం అమలు చేస్తామని స్పష్టం చేశారు. నూతన సంవత్సర వేడుకలను అందరూ సురక్షితంగా ఆనందంగా జరుపుకోవాలని, పోలీసులకు సహకరించాలని హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు ప్రజలను కోరారు.

## "ఏ ఫర్ ఆంధ్రా"... 'మనీకంట్రోల్' ఇదే చెబుతోంది

అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ రాష్ట్ర సాంకేతిక ప్రగతిపై హర్షం వ్యక్తం చేశారు. ప్రముఖ ఆర్థిక వార్తా సంస్థ మనీకంట్రోల్ విడుదల చేసిన '2025 టెక్ అండ్ స్టార్టప్ గైడ్'లో ఆంధ్రప్రదేశ్‌కు దక్కిన ప్రత్యేక గుర్తింపును ఆయన సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. 2025 సంవత్సరం ముగియనున్న నేపథ్యంలో, మనీకంట్రోల్ సంస్థ ఈ ఏడాది దేశంలోని టెక్నాలజీ, స్టార్టప్ రంగాల్లో చోటుచేసుకున్న పరిణామాలపై 'ఏ టు జడ్' (AZ) పేరుతో ఒక ప్రత్యేక నివేదికను రూపొందించింది. ఇందులో ఇంగ్లీష్ అక్షరమాల ప్రకారం ఒక్కో అక్షరానికి ఒక్కో ట్రెండ్‌ను లేదా అంశాన్ని జోడించారు. ఈ జాబితా 'ఏ' (A) అక్షరంతో మొదలవ్వగా.. దానికి 'ఏ ఫర్ ఆంధ్రా' అని నామకరణం చేయడం విశేషం. దీనిపై మంత్రి లోకేశ్ స్పందిస్తూ.. "2025 ఏ టు జడ్ జాబితా ఆంధ్రా పేరుతో మొదలైంది. భారతదేశపు నూతన టెక్ డార్లింగ్‌గా ఆంధ్రా అవతరించింది. భవిష్యత్తును నడిపించే శక్తిగా రాష్ట్రం ఎదుగుతోంది" అని పేర్కొన్నారు. రాష్ట్రంలో మారుతున్న టెక్నాలజీ ముఖచిత్రానికి, పెరుగుతున్న స్టార్టప్ ఎకోసిస్టమ్‌కు ఇది నిదర్శనమని ఆయన అభిప్రాయపడ్డారు. దేశీయ టెక్నాలజీ రంగంలో ఆంధ్రప్రదేశ్ కీలక శక్తిగా మారుతోందని, పెట్టుబడులకు, ఆవిష్కరణలకు రాష్ట్రం కేంద్ర బిందువుగా నిలుస్తోందని మనీకంట్రోల్ కథనం పేర్కొన్నట్లు సమాచారం. ఈ గుర్తింపు పట్ల ఐటీ వర్గాల నుంచి కూడా సానుకూల స్పందన వస్తోంది.

## కొత్త ఏడాది మీకందరికీ మంచి జరగాలి: ఏపీ సీఎం

అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందుకుంటున్న లక్షలాది మంది లబ్ధిదారులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ 'ఎక్స్' వేదికగా సందేశం విడుదల చేశారు. ప్రతి ఒక్కరి జీవితంలో మంచి జరగాలని ఆయన ఆకాంక్షించారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని, పింఛను సొమ్మును లబ్ధిదారుల ఇళ్ల వద్దకే ఒకరోజు ముందుగా అందజేస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత దేశంలో ఎక్కడా లేని విధంగా ఇప్పటివరకు పింఛన్ల కోసం రూ.50 వేల కోట్లకు పైగా ఖర్చు చేశామని ఆయన వెల్లడించారు. డిసెంబర్ నెలకు గాను 63.12 లక్షల మందికి పింఛన్లు అందించేందుకు రూ.2743 కోట్లను విడుదల చేసినట్లు ఆయన పేర్కొన్నారు. సాధారణంగా ప్రతి నెల 1వ తేదీన పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉండగా, నూతన సంవత్సర శుభ సందర్భంగా డిసెంబర్ 31వ తేదీనే ఇళ్ల వద్ద పింఛన్లు పంపిణీ చేసే ఏర్పాటు చేశామని సీఎం తెలిపారు. పేదల జీవితాలకు ఆర్థిక భరోసా కల్పించే పింఛన్ల పంపిణీ తమ ప్రభుత్వానికి ఎంతో సంతృప్తినిచ్చే సంక్షేమ కార్యక్రమమని చంద్రబాబు నాయుడు గారు అన్నారు. మరొకసారి అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ ఆయన

## కిటకిటలాడుతున్న వనం.. ముందస్తు మొక్కుల్లో మేడారం భక్తులు!

ములుగు: ములుగు జిల్లాలోని మేడారం అప్పుడే ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. వచ్చే నెల (జనవరి) 28 నుంచి నాలుగు రోజుల పాటు జరిగే సమ్మక్కసారలమ్మ మహా జాతరకు ముందే భక్తులు మేడారానికి క్యూ కడుతున్నారు. జాతర సమయంలో ఉండే విపరీతమైన రద్దీని దృష్టిలో ఉంచుకుని, ముఖ్యంగా చిన్న పిల్లలు ఉన్నవారు, వృద్ధులు ఇప్పుడే వచ్చి వనదేవతలను దర్శించుకుంటున్నారు. మేడారానికి తరలివస్తున్న భక్తులు తమ బరువుకు తూగేలా 'బంగారం' (బెల్లం) తూచి గద్దెల వద్ద సమర్పిస్తున్నారు. కోరిన కోర్కెలు తీర్చే తల్లులకు ఎదుర్కోళ్లు, యాట మొక్కులతో తమ భక్తిని చాటుకుంటున్నారు. మేడారంతో పాటు చుట్టుపక్కల 40 కిలోమీటర్ల మేర ఉండే ప్రతి చెట్టు, పుట్టను అమ్మవార్ల ప్రతిరూపంగా భావించడం ఇక్కడి విశేషం. జాతర సమయంలో అడవిలోని వన్యప్రాణులు భక్తులకు ఎలాంటి హాని చేయవనేది తరతరాలుగా వస్తున్న నమ్మకం. ఈసారి జాతరను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.251 కోట్లతో భారీ అభివృద్ధి పనులు చేపట్టింది. గద్దెల ఆధునికీకరణ, విశాలమైన క్యూలైన్లు, రాతి కట్టడాలు, రహదారుల విస్తరణతో మేడారం సరికొత్తగా కనిపిస్తోంది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తలస్నానాల కోసం జంపన్న వాగు వద్ద కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. జాతర సమయంలో మేడారం చుట్టుపక్కల ఉన్న ఊరట్టం, కన్నెపల్లి, నార్లాపూర్ వంటి గ్రామాలన్నీ కలిసి ఒక పెద్ద పట్టణంగా మారిపోతున్నాయి. ఇప్పటికే అక్కడ హోటళ్లు, బిర్యానీ సెంటర్లు వెలిశాయి. ఎడ్లబండ్ల నుంచి హెలికాప్టర్ సేవల వరకు, సామాన్యుల వినోదం నుంచి విలాసవంతమైన వస్తువుల వరకు అన్నీ మేడారంలో అందుబాటులోకి వస్తున్నాయి.




## కీలక మైలురాయిని చేరిన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ

హైదరాబాద్: యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ కీలక మైలురాయిని చేరింది. స్కిల్స్ యూనివర్సిటీలో శిక్షణ పొందిన విద్యార్థుల సంఖ్య వెయ్యికి చేరింది. ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు ఉద్యోగాలకు సరిపోయే నైపుణ్యం అందించే లక్ష్యంతో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీకి గతేడాది ఆగస్టు 1న శంకుస్థాపన జరిగింది. పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్య విధానంలో యూనివర్సిటీ నిర్వహిస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఛాన్సలర్‌గా, విశ్రాంత ఐఏఎస్ అధికారి సుబ్బారావు వీసీగా ఉండగా.. ప్రముఖ పారిశ్రామికవేత్తలతో కూడిన బోర్డ్ ఆఫ్ మేనేజ్‌మెంట్ యూనివర్సిటీని పర్యవేక్షిస్తోంది. బోర్డుకు పారిశ్రామిక దిగ్గజం ఆనంద్ మహీంద్రా ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం గచ్చిబౌలిలోని ట్రిపుల్ ఐటీలో నిర్వహిస్తున్న తాత్కాలిక క్యాంపస్‌లో లాజిస్టిక్స్, హెల్త్‌కేర్, లైఫ్ సైన్సెస్, ఫార్మా, బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ వంటి రంగాల్లో స్వల్పకాలిక, సర్టిఫికేషన్ కోర్సుల ద్వారా శిక్షణ ఇస్తున్నారు. మైక్రోసాఫ్ట్, రెడ్డీస్ ల్యాబ్స్, ఏఐజీ, అపోలో ఆసుపత్రులు, జీఎంఆర్ కార్గో వంటి ప్రముఖ సంస్థలు యూనివర్సిటీతో భాగస్వామ్యమయ్యాయి.

## మస్క్ మాస్టర్ ప్లాన్.. ఏఐ కంప్యూటింగ్ కెపాసిటీ ఇక 2 గిగావాట్లు

డిసెంబర్ 31 : టెస్లా, స్పేస్ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ తన ఏఐ సామ్రాజ్యాన్ని మరింత వేగంగా విస్తరిస్తున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో అగ్రగామిగా నిలిచేందుకు ఆయన స్థాపించిన 'ఎక్స్ఏఐ' సంస్థ తాజాగా అమెరికాలో మరో భారీ భవనాన్ని కొనుగోలు చేసింది. ఇప్పటికే మెమ్ఫిస్‌లో కార్యకలాపాలు సాగిస్తున్న ఈ సంస్థ.. అక్కడికి సమీపంలోనే మూడో భవనాన్ని కూడా సొంతం చేసుకుంది. ఈ కొత్త భవనానికి 'మాక్రోహార్డర్' అని పేరు పెట్టినట్లు మస్క్ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా వెల్లడించారు. ఈ కొనుగోలుతో తమ ఏఐ ట్రైనింగ్ కంప్యూటింగ్ సామర్థ్యం దాదాపు 2 గిగావాట్లకు చేరుకుంటుందని ఆయన స్పష్టం చేశారు. సాధారణంగా ఒక గిగావాట్ విద్యుత్ సుమారు 7.5 లక్షల ఇళ్లకు సరిపోతుంది. దీన్ని బట్టి మస్క్ ఏఐ డేటా సెంటర్ల సామర్థ్యం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. మిసిసిపీలోని సౌత్‌హెవెన్‌లో ఉన్న ఈ కొత్త భవనం.. ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్న 'కొలోసస్ 2' ఫెసిలిటీకి ఆనుకుని ఉంది. ఇప్పటికే మస్క్ మెమ్ఫిస్‌లో 'కొలోసస్' పేరుతో ఒక డేటా సెంటర్‌ను నిర్వహిస్తున్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఏఐ డేటా సెంటర్‌ను నిర్మించాలన్నది మస్క్ లక్ష్యం. ఇందులో భాగంగా భవిష్యత్తులో 5,50,000 ఎన్విడియా చిప్‌లను వినియోగించనున్నట్లు ఆయన గతంలోనే ప్రకటించారు. మరోవైపు, ఎక్స్ఏఐ సంస్థ విలువను 230 బిలియన్ డాలర్లుగా లెక్కగడుతూ భారీగా నిధుల సమీకరణకు మస్క్ చర్చలు జరుపుతున్నారు. ఇటీవల కోర్టు తీర్పుతో టెస్లా స్టాక్ ఆప్షన్లు తిరిగి మస్క్ చేతికి రావడంతో.. ఆయన సంపద ఏకంగా 750 బిలియన్ డాలర్లకు చేరింది. దీంతో ప్రపంచంలోనే తొలి ట్రిలియనీర్‌గా అవతరించే దిశగా మస్క్ దూసుకుపోతున్నారని ఫోర్బ్స్ అంచనా వేసింది. ఇదే సమయంలో వికీపీడియాపై మస్క్ మరోసారి సెటైర్లు వేశారు. వికీపీడియా పక్షపాత ధోరణితో ఉందని, దానికి ప్రత్యామ్నాయంగా తాము తీసుకొస్తున్న 'గ్రోక్‌పీడియా' మరింత కచ్చితత్వంతో, విస్తృత సమాచారంతో ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

## హిజాబ్ వివాదం.. విధుల్లో చేరని డాక్టర్ నుస్రత్ పర్వీన్

ఇటీవల బిహార్‌లో జరిగిన ఉద్యోగ నియామక పత్రాల స్వీకరణ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ ఓ వైద్యురాలి హిజాబ్‌ను తొలగించడంపై వివాదం నెలకొన్న విషయం తెలిసిందే. ఆ ఘటనతో ఇబ్బందిపడిన వైద్యురాలు నుస్రత్ పర్వీన్ ఇంకా విధుల్లో చేరలేదని స్థానిక అధికారులు వెల్లడించారు. నియామక పత్రాలు అందుకున్న వైద్యులు పోస్టింగ్‌లో చేరడానికి ఇచ్చిన డెడ్‌లైన్ నేటితో ముగుస్తుందని.. సబల్‌పూర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో విధుల్లో చేరాల్సిన ఆమె నుంచి ఎటువంటి సమాచారం లేదని అధికారులు వెల్లడించారు. ఈ రోజు రిపోర్టు చేయకపోతే ఆమె అపాయింట్‌మెంట్‌ను రద్దు చేయాల్సి ఉంటుందన్నారు. కాగా హిజాబ్ వివాదం తర్వాత పర్వీన్ కుటుంబం పట్నా నుంచి కోల్‌కతాకు మారినట్లు స్థానిక మీడియా వర్గాలు వెల్లడించాయి. ఇటీవల పట్నాలో జరిగిన ఓ కార్యక్రమంలో నుస్రత్ పర్వీన్ అనే వైద్యురాలికి నీతీశ్ ఆయుష్ సర్టిఫికెట్‌ను అందజేశారు. సర్టిఫికెట్‌ను చేతికిచ్చిన ఆయన.. డాక్టర్ ముఖంపై ఉన్న హిజాబ్‌ను కొంతమేర తొలగించారు. సీఎం చర్యకు మహిళ స్పందించనప్పటికీ.. నిశ్చేష్టురాలై చూస్తూ ఉండిపోయింది. ఈ వీడియో నెట్టింట వైరల్‌గా మారడంతో.. పలువురు ప్రముఖులు, రాజకీయ నాయకులు నీతీశ్ చర్యను తీవ్రంగా ఖండించారు.

## తల్లికి అంత్యక్రియలు.. శ్మశానవాటికలో ఉండగా చేతికి నామినేషన్ పేపర్లు..!

మహారాష్ట్రలో ఓ అనూహ్య ఘటన జరిగింది. రాష్ట్రంలో స్థానిక ఎన్నికలకు నగారా మోగిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తన తల్లికి అంత్యక్రియలు నిర్వహిస్తోన్న సమయంలో శివసేన నాయకుడు యోగేష్ గౌన్నాడేకి ఎలక్షన్ టికెట్ లభించింది. శ్మశానవాటికలో ఉండగా.. తన అభ్యర్థిత్వానికి పార్టీ నుంచి ఆమోదం లభించడంపై ఆయన ఉద్వేగానికి గురయ్యారు. ప్రస్తుతం ఈ విషయం చర్చనీయాంశంగా మారింది. మహారాష్ట్రలో 29 మున్సిపల్ కార్పొరేషన్లకు త్వరలో ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో పోటీ చేయాలనుకొన్న యోగేష్ గౌన్నాడే తల్లి మరణించింది. దీంతో పోటీ



చేయాలనుకొన్న ఆశను వదులుకున్నారు. అయితే, పార్టీ మాత్రం ఆయన అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసింది. నామినేషన్‌కు చివరిరోజు కావడంతో.. పార్టీ నేతలు నామినేషన్ పత్రాలతో హుటాహుటిన శ్మశానవాటికకు చేరుకున్నారు. గౌన్నాడే తల్లి అంత్యక్రియలు జరుగుతుండగానే వారు ఆయనకు నామినేషన్ పత్రాలు అందజేశారు. అంత్యక్రియలు ముగిసిన అనంతరం.. చివరి నిమిషంలో నామినేషన్ దాఖలు చేశారు. డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ శిందే పార్టీకి చెందిన గౌన్నాడే నాగ్‌పుర్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 5వ వార్డు నుంచి పోటీకి దిగారు. ఆయన కుమార్తె కృతిక 8వ వార్డు నుంచి బరిలోకి దిగారు.

# ప్రమాదాలు జరిగే స్థలాలను గుర్తించి అక్కడ అవసరమైన నివారణ చర్యలు తీసుకోవాలి

*** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి**

మేడ్చల్ ప్రతినిధి, (ప్రజాస్ఫూర్తి) : జిల్లాలో ఎక్కువగా ప్రమాదాలు జరిగే స్థలాలను గుర్తించి అక్కడ అవసరమైన నివారణ చర్యలు తీసుకోవాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న జాతీయరోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా బుధవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ మిని మీటింగ్ హాల్ లో ఏర్పాటు చేసిన జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశానికి రోడ్డు సేఫ్టి డిసిపి మనోహర్ తో కలిసి అదనపు కలెక్టరు హజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలోని సమస్యాత్మకమైన, మరమ్మత్తులు అవసరమైన రోడ్ల వివరాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అదనపు కలెక్టరు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాద బాధితులకు మొదటి గంటలోపు (గోల్డెన్ అవర్) వైద్యసహాయం అందిస్తే, ప్రస్తుత రోడ్డు ప్రమాద మరణాలు చాలా వరకు తగ్గుతాయని హాజరయ్యారు. రోడ్డు ప్రమాద బాధితులకు మొదటి గంటలోపు (గోల్డెన్ అవర్) వైద్య సహాయం అందిస్తే, రోడ్డు ప్రమాద మరణాలు చాలా వరకు తగ్గుతాయని అన్నారు. ప్రమాదంలో గాయపడిన వారిని మొదటి గంటలో ఆసుపత్రికి చేర్చిన వారికి 25 వేల నగదు బహుమతితోపాటు (రాహ్ వీర్) ప్రశంసాపత్రాన్ని అందజేయడం జరుగుతుందన్నారు. గత సమావేశంలోని సమస్యలను ఎంత వరకు పరిష్కరించారు, ఇంకాఎన్ని పెండింగ్ లో ఉన్నవి అని సంబంధిత అధికారులను, మున్సిపల్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అవసరమైన చోట ఎలక్ట్రిక్ పోల్స్ ను షిఫ్ట్ చేసిరోడ్డు విస్తీర్ణం పెంచాలన్నారు. రోడ్డు ఇరు వైపుల ఆక్రమణలకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టరు ఆదేశించారు. రోడ్ల పై వర్షం నీరు నిలువకుండా



తగిన చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్ల పై ఎక్కువ ప్యాచ్ వర్క్స్ చేయకుండా అవసరమైన మేరకు కొత్త రోడ్లను నిర్మించాలని తెలిపారు. రోడ్ సేఫ్టి డిసిపి మనోహర్ మాట్లాడతూ రోడ్డు ప్రమాద బాధితులకు 7రోజుల వరకు నగదు రహిత ఉచిత వైద్య చికిత్స అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే సమీపంలోని ప్రభుత్వ ప్రైవేటు ఆసుపత్రులలో గోల్డెన్ అవర్ లో చికిత్స అందించి బాధితుల ప్రాణాలు కాపాడటమే ప్రధాన లక్ష్యమన్నారు. ఈ అంశాల పై ప్రజలలో అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఆర్.టి.ఎ కమిటి సభ్యులు జయ్ పాల్ రెడ్డి మాట్లాడుతూరోడ్డు భద్రత మాసోత్సవాల పై ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. హాకీంపేట, తూంకుంటలో బ్లాక్ స్పాట్స్ ను గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరారు. ఈ సమావేశంలో ఆర్ అండ్ బిఈఈ శ్రీనివాస మూర్తి, పోలీస్, ట్రాఫిక్ అధికారులు, నేషనల్ హై వే, వైద్య, విద్యా, టిజిఆర్టిసి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ జర్నలిస్ట్ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గా సుందర్ కల్లూరి



ప్రజాస్ఫూర్తి, హైదరాబాద్ : జర్నలిస్టుల తరపున ప్రభుత్వాన్ని ప్రశ్నించడంలో ముందుంటానని తెలంగాణ జర్నలిస్టు సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గా సుందర్ కల్లూరి అల్టిమేటం జారీ చేశారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ఏర్పడిన తర్వాత పిఆర్వోగా రెండు ప్రభుత్వాలలో పనిచేసిన అనుభవం ఉన్నటువంటి సుందర్ కల్లూరిని తెలంగాణ జర్నలిస్టు సంక్షేమ సంఘానికి రాష్ట్ర ఉపాధ్యక్షులు గా అధ్యక్షుడు ఆనం చిన్ని వెంకటేశ్వరరావు నియమించడం జరిగింది.ఈ సందర్భంగా సుందర్ కల్లూరి మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమానికై ఆవిర్భవించినటువంటి తెలంగాణ జర్నలిస్టు సంక్షేమ సంఘానికి రాష్ట్ర ఉపాధ్యక్షులు గా నియమించినటువంటి గౌరవ అధ్యక్షులు ఆనం చిన్ని వెంకటేశ్వరరావు కి, తోటి కార్యవర్గానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. జర్నలిస్టుల తరపున ప్రభుత్వాన్ని ప్రశ్నించడంలో ముందుంటానన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికై అహర్నిశలు కష్టపడతానని, తనకు అప్పగించినటువంటి బాధ్యతకు న్యాయం చేస్తానని తెలియజేశారు.

## చిన్న పిల్లల ఆరోగ్యం పట్ల అశ్రద్ధ వహించకుండా వ్యాక్సిన్ వేయించాలి

*** అల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్**



శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : చిన్న పిల్లల ఆరోగ్యం పట్ల అశ్రద్ధ వహించకుండా వ్యాక్సిన్ వేయించాలని అల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ అన్నారు. అల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని శంషిగూడ వార్డ్ కార్యాలయంలో 0 నుండి 5 సంవత్సరాల వరకు ఉన్న పిల్లలకు అందిస్తున్న టీకాల (వ్యాక్సిన్) ప్రక్రియను డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రతి బుధవారం ఈ వ్యాక్సినేషన్ కార్యక్రమం ఉంటుందన్నారు. గర్భిణీ స్త్రీలకు తగు సూచనలు సలహాలు అందిస్తారన్నారు. గర్భిణీ స్త్రీలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సిబ్బంది అందిస్తున్న సలహాలు పాటించాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సమ్మారెడ్డి, పోశెట్టిగౌడ్, ఆశా వర్కర్స్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి క్వింటాల్ బియ్యం అందజేత

**- సర్పంచ్ జువ్వి నర్సింహ్మా**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మండలం ధర్మోజిగూడెం గ్రామానికి చెందిన ఏషగోని చిత్తారమ్మ ఇటీవల మృతిచెందారు. విషయం తెలుసుకున్న ధర్మోజిగూడెం గ్రామ సర్పంచ్ జువ్వి నర్సింహ్మా మృతురాలి కుటుంబ సభ్యులను బుధవారం పరామర్శించారు. చిత్తారమ్మ మృతి పట్ల ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మృతురాలి దశదినకర్మకు క్వింటాల్ బియ్యం అందజేశారు. భవిష్యత్తులో ఆదుకుంటానని కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ఊదరి శ్రీనివాస్, ఐతరాజు శారద లింగస్వామి, రాచకొండ భార్గవ్, గ్రామ పెద్దలు బత్తుల శ్రీహరి, కొంతం బుచ్చిరెడ్డి, ఊదరి లింగయ్య, ఊదరి శంకర్, పిసాటి భూపాల్ రెడ్డి, జంగం అంజయ్య, ఊదరి నర్సింహ్మా, చెన్నోజు విజయ్ చారి, ఊదరి పోశయ్య, సామిడి లింగారెడ్డి, ఊదరి ఇస్తారి, బద్రి గణేష్, జక్కలి యాదయ్య, గుర్రం మల్లిఖార్జున్ తదితరులు పాల్గొన్నారు.



## టెట్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

**: జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: టెట్ పరీక్షలు అభ్యర్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న కీలకమైనవని, ఎలాంటి లోపాలకు తావు లేకుండా పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో టెట్ పరీక్షల నిర్వహణపై అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యచందన, సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జనవరి 2026లో 4, 5, 6, 8, 9, 11, 19, 20 తేదీలలో టెట్ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 9.00 నుంచి 11.30 గంటల వరకు, మధ్యాహ్నం 2.00 నుంచి 4.30 గంటల వరకు రెండు సెషన్లలో పరీక్షలు జరుగుతాయని చెప్పారు. జిల్లాలో మొత్తం 1017 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరవుతున్నారని వెల్లడించారు.టెట్ పరీక్షల కోసం జిల్లాలో రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సుజాతనగర్ మండలంలోని అబ్దుల్ కలాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజికల్ సైన్సెస్, పాల్వంచ మండలంలోని అనుబోస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో పరీక్షలు నిర్వహించనున్నట్లు వివరించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పరీక్షలు సజావుగా నిర్వహించాలన్నారు.పరీక్షల పర్యవేక్షణకు ముగ్గురు అబ్జర్వర్లు, రెండు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను నియమించినట్లు తెలిపారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, కేంద్రాల పరిసరాల్లో 163 బిఎన్ఎస్ఎస్ సెక్షన్ అమలు చేయాలని ఆదేశించారు. అవసరమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ శాఖను ఆదేశించారు.పరీక్షలు పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో నిర్వహించనున్నందున కంప్యూటర్లు, నెట్‌వర్క్ కనెక్టివిటీ సక్రమంగా ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని, సాంకేతిక లోపాలు తలెత్తకుండా ఐటీ సిబ్బందిని అందుబాటులో ఉంచాలని సూచించారు. జనవరి 3న అబ్జర్వర్ల పర్యవేక్షణలో మాక్ టెస్ట్ నిర్వహించాలని తెలిపారు.పరీక్షా కేంద్రాల్లోకి ప్రవేశించే అభ్యర్థులు ప్రభుత్వ గుర్తింపు కార్డు తప్పనిసరిగా తీసుకురావాలని, పరిశీలన అనంతరమే అనుమతిస్తామని స్పష్టం చేశారు. ఎలక్ట్రానిక్ పరికరాలకు పూర్తిగా నిషేధం విధించినట్లు తెలిపారు. అభ్యర్థులకు సౌకర్యంగా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని, త్రాగునీరు, శౌచాలయాలు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. దివ్యాంగ అభ్యర్థులకు అవసరమైన సహాయకులను నియమించాలని సూచించారు.పరీక్షల సమయంలో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి మందులు అందుబాటులో ఉంచాలని వైద్య శాఖను, అభ్యర్థులు సమయానికి చేరుకునేలా ఆర్టీసీ బస్సులు నడపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా జనరేటర్లు, ఇన్వర్టర్లు సిద్ధంగా ఉంచాలని తెలిపారు. అభ్యర్థులు పరీక్ష ప్రారంభానికి గంటన్నర ముందే కేంద్రాలకు చేరుకోవాలని, పరీక్షకు 10 నిమిషాల ముందు గేట్లు మూసివేస్తామని చెప్పారు. గేట్లు మూసిన తరువాత ఎవరినీ లోపలికి అనుమతించబోమని, పరీక్ష పూర్తయ్యే వరకు బయటకు కూడా అనుమతించరాదని స్పష్టం చేశారు. పరీక్షల నిర్వహణలో లోపాలు తలెత్తితే సంబంధితులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి నాగలక్ష్మి, ఇంటర్మీడియట్ శాఖ అధికారి వెంకటేశ్వర్లు, వైద్యశాఖ అధికారి తుకారాం రాథోడ్, అనుబోస్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రవికుమార్, అబ్దుల్ కలాం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ దయాకర్ రావు, అబ్జర్వర్లు, పోలీస్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## చిత్తారమ్మ దేవి జాతరను విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లను చేయాలి

*** బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్**

కుత్బుల్లాపూర్ (ప్రజాస్ఫూర్తి ) : ప్రతి ఏడు మాదిరిగానే ఈ సంవత్సరం కూడా చిత్తారమ్మ దేవి జాతరను విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లను ఏర్పాటు చేద్దామని బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ అన్నారు. జీడిమెట్ల డివిజన్ పెట్ బషీరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గాజులరామారం చిత్తారమ్మ దేవాలయం కమిటీ సభ్యులు బుధవారం బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ని మర్యాదపూర్వకంగా కలిసి జనవరి 23 నుంచి నిర్వహించే చిత్తారమ్మ జాతర ఏర్పాట్లపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జాతర సమయంలో గుడి ఆవరణలో వీధి దీపాలతో పాటు ఫ్లడ్ లైట్ ల ఏర్పాటు, పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా అంటువ్యాధులు ప్రబలకుండా గేమాక్సిన్ పౌడర్ చల్లించడంతో పాటు భక్తులకు వాటర్ ట్యాంకర్లతో మంచినీటిని అందించేలా ఏర్పాట్లు కల్పించాలన్నారు. అనంతరం బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ హైదరాబాద్ నగరంతో పాటు తెలంగాణ రాష్ట్రంలోని అతిపెద్ద జాతర్లలో చిత్తారమ్మ దేవాలయం జాతర ఒకటన్నారు. త్వరలోనే అధికారులు, ఆలయ కమిటీ సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించి జాతర విజయవంతంకు కావలసిన అన్ని ఏర్పాట్లను పూర్తిచేసి జాతరను జయప్రదం చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కూన అంతయ్య గౌడ్, కమిటీ సభ్యులు నరసింహ, కూన హరి గౌడ్, డివిజన్ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి, మాజీ పాక్స్ డైరెక్టర్ శ్రీనివాస్ యాదవ్, సీనియర్ నాయకులు సంపత్ మాధవ రెడ్డి, అడ్వకేట్ కమలాకర్, తెలంగాణ సాయి తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన మంత్రి తుమ్మల



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి నివాసానికి వెళ్లిన మంత్రి తుమ్మల మర్యాదపూర్వకంగా కలుసుకుని శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు.నూతన సంవత్సరంలో ప్రజా ప్రభుత్వ కార్యక్రమాలు విజయవంతంగా అమలై, ముఖ్యంగా రైతులకు మహర్దశ పట్టేలా ప్రభుత్వ చర్యలు ఫలప్రదంగా ఉండాలని మంత్రి తుమ్మల ఆకాంక్షించారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం మరింత వేగం పొందాలని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

## జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

*** బొకేలు, శాలువాల బదులు విద్యార్థులకు ఉపయోగపడే సామగ్రి అందించాలి**

*** జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**





ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లా ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు. రానున్న నూతన సంవత్సరం జిల్లా ప్రజలందరికీ ఆరోగ్యం, ఆనందం, శాంతి, సమృద్ధి తీసుకురావాలని, జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలు మరింత వేగంగా సాగాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేయడానికి తనను కలెక్టర్ కార్యాలయానికి కలిసేందుకు వచ్చే అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు బొకేలు, పుష్పగుచ్ఛాలు, శాలువాలు తీసుకొని రావద్దని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. నూతన సంవత్సరం సందర్భంగా బొకేలు, శాలువాలు, పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలపడం సహజమేనని, అయితే వాటికి బదులుగా పేద విద్యార్థులకు ఉపయోగపడే నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, తదితర అవసరమైన సామగ్రిని అందించాలని ఆయన సూచించారు. ఈ విధంగా అందించే సామగ్రి పేద విద్యార్థుల చదువుకు ఎంతగానో ఉపయోగపడుతుందని, సేకరించిన విద్యా సామగ్రిని త్వరలో అర్హులైన విద్యార్థులకు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు.

## కాంగ్రెస్ విధానాలతో నేత కార్మికులకు అన్యాయం: కేటీఆర్

సిరిసిల్ల: కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక విధానాలతో నేత కార్మికులకు అన్యాయం జరుగుతోందని మాజీ మంత్రి, భారత రాష్ట్రసమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మండిపడ్డారు. సిరిసిల్ల అపారెల్ పార్క్‌ను పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ''అపారెల్ పార్క్‌లో మా హయాంలో వచ్చిన రెండు పరిశ్రమలు మినహా ఇప్పటి వరకు కొత్తగా ఒక్కటీ రాలేదు. 25వేల మంది మహిళలకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో పార్క్ ఏర్పాటు చేశాం. సంక్రాంతి లోపు వర్కర్ టూ ఓనర్ పథకం లబ్ధిదారులను ప్రకటించాలి. లేదంటే 10వేల మందితో నిరసన కార్యక్రమం చేస్తాం. మా ప్రభుత్వం ఉన్నప్పుడు కార్మికులను కంటికి రెప్పలా కాపాడుకున్నాం. రూ.400 కోట్లతో అపారెల్ పార్క్ ఏర్పాటు చేసింది మేమే.. ఈ ప్రభుత్వం ఏం చేయలేదు'' అని కేటీఆర్ అన్నారు.

# వివేకానంద విద్యా మందిర్ హై స్కూల్ లో ఉత్సాహభరితంగా ఫుడ్ ఫెస్ట్

జీడిమెట్ల, (ప్రజాస్ఫూర్తి) : సుభాష్ నగర్ పరిధిలోని వివేకానంద విద్యా మందిర్ హై స్కూల్ లో ఫుడ్ ఫెస్ట్ కార్యక్రమం ఎంతో ఉత్సాహభరితంగా జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మండవ.శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులు వివిధ రకాల సంప్రదాయ , ఆధునిక వంటకాలను సిద్ధం చేసి ప్రదర్శించడం చాలా సంతోషకరంగా ఉందన్నారు. ఆహారం తయారీ ప్రక్రియ ద్వారా పరిశుభ్రత పోషకారం ప్రాముఖ్యత, బృందంగా పనిచేయటం వంటి విలువలను విద్యార్థులు నేర్చుకున్నారు అని అన్నారు. ఫుడ్ ఫెస్ట్ ద్వారా విద్యార్థుల సృజనాత్మకత నైపుణ్యాలు మరింత వెలుగులోకి వచ్చాయన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ఉపాధ్యాయులు, విద్యార్థులు , సహకరించిన తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ ఎం. సునీత, వైస్ ప్రిన్సిపాల్ పి.లత , క్యూ.యం. ఆర్. ఎస్.ఏ ఉపాధ్యక్షులు ముభాసిర్ తదితరులు పాల్గొన్నారు.






## భద్రాద్రి ఆలయ మాస్టర్ ప్లాన్‌కు తుది రూపం

* దేవాదాయ శాఖ కమిషనర్‌తో మంత్రి తుమ్మల సమీక్ష
* గోదావరి పుష్కరాలు కుంభమేళా తరహాలో నిర్వహించాలి : మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం : దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాద్రి శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయం నూతన శోభ సంతరించుకోనుంది. ఆలయ మాస్టర్ ప్లాన్, విస్తరణ పనులు, రాబోయే గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై దేవాదాయ శాఖ కమిషనర్ హరీష్‌తో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమీక్ష సమావేశం నిర్వహించారు. బుధవారం హైదరాబాద్ సచివాలయంలో జరిగిన ఈ సమావేశంలో భద్రాద్రి ఆలయ మాడ వీధుల విస్తరణ, ప్రాకార నిర్మాణాలు, పుష్కరాల ఏర్పాట్లపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ, 1664లో భక్త రామదాసు నిర్మించిన భద్రాద్రి రామాలయం దేశానికి గర్వకారణమని అన్నారు. పెరుగుతున్న భక్తుల సంఖ్యకు అనుగుణంగా ఆలయ విస్తరణ పనులు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు.

**ఆగమ శాస్త్రం ప్రకారమే విస్తరణ**

భద్రాచలం రామాలయం మాడ వీధుల విస్తరణ పనులు పూర్తిగా ఆగమ శాస్త్రం ప్రకారం చేపట్టాలని మంత్రి స్పష్టం చేశారు. ఆర్కిటెక్ట్ రూపొందించిన డిజైన్లు, మాస్టర్ ప్లాన్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆమోదంతో తుది రూపం ఇచ్చి పనులు ప్రారంభించాలని సూచించారు. దశల వారీగా మూడు సంవత్సరాల్లో ఆలయ విస్తరణ పనులు పూర్తి చేయాలని దేవాదాయ శాఖ కమిషనర్‌కు దిశానిర్దేశం చేశారు.

**భూసేకరణ పూర్తి – అభివృద్ధికి శ్రీకారం**

ఆలయ అభివృద్ధికి ఆటంకంగా ఉన్న భూసేకరణ సమస్యకు కాంగ్రెస్ ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపిందని మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో రూ.34 కోట్ల నిధులు విడుదల చేసి భూసేకరణను పూర్తిచేసినట్లు చెప్పారు. భూసేకరణ పూర్తవడంతో ఆలయ విస్తరణ పనులకు మార్గం సుగమమైందని అన్నారు. సీఎం చేతుల మీదుగా శంకుస్థాపన నిర్వహించనున్నట్లు తెలిపారు.

**నవ భద్రాద్రి దిశగా అడుగులు**

మంత్రి తుమ్మల చొరవతో ఎన్నాళ్లుగా పెండింగ్‌లో ఉన్న భూసేకరణ సమస్య పరిష్కారమై, దక్షిణ అయోధ్యగా భద్రాద్రి ఆలయ కీర్తి మరింత పెరిగేలా అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. మాస్టర్ ప్లాన్ నమూనాల ప్రకారం అత్యద్భుతంగా ఆలయ పునర్నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నట్లు వెల్లడించారు.

**కుంభమేళా తరహాలో గోదావరి పుష్కరాలు**

జూలై 23, 2027 నుంచి ప్రారంభం కానున్న గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని మంత్రి తుమ్మల ఆదేశించారు. అన్ని శాఖలతో సన్నాహక సమావేశం నిర్వహించి కుంభమేళా తరహాలో పుష్కరాల ఏర్పాట్లు చేయాలని సూచించారు. లక్షలాది మంది భక్తులు భద్రాచలం రామాలయ దర్శనం, గోదావరి పుష్కర స్నానాలకు వచ్చే అవకాశం ఉన్నందున స్నాన ఘాట్లు, వసతి కేంద్రాలు, మెడికల్ క్యాంపులు, శానిటేషన్, తాగునీరు, రవాణా వంటి సౌకర్యాలను పకడ్బందీగా ఏర్పాటు చేయాలని అన్నారు. శానిటేషన్ విషయంలో ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు.

**పుష్కరాలపై తుమ్మల అనుభవాల మార్గనిర్దేశం**

2003, 2015 గోదావరి పుష్కరాల సమయంలో మంత్రిగా పనిచేసిన అనుభవాలను గుర్తు చేస్తూ, రాబోయే పుష్కరాల నిర్వహణ ప్రభుత్వ ప్రతిష్టను పెంచేలా ఉండాలని మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో నిర్వహించే గోదావరి పుష్కరాలు కోట్లాది మంది భక్తులు మెచ్చేలా ఉండాలని దేవాదాయ శాఖ కమిషనర్ హరీష్‌కు ప్రభుత్వ విధానాన్ని వివరించారు.

# వైష్ణవి టెక్నో స్కూల్ లో ఉత్సాహంగా ‘‘ఫూడిస్ ఫియస్టా’’





జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : గాజులరామారం సర్కిల్ జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని సంజయ్ పురి కాలనీలో గల వైష్ణవి టెక్నో స్కూల్ లో “ఫూడిస్ ఫియస్టా”కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు వివిధ రకాల సంప్రదాయ ,ఆధునిక వంటకాలను సిద్ధం చేసి సుమారు 280కి పైగా ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ట్రస్మా మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా జనరల్ సెక్రటరీ బిర్రు అంజనేయులు, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా టీయూడబ్ల్యుజే (ఐజేయు) అధ్యక్షులు గడ్డమీది బాలరాజు, వైష్ణవి విద్యా సంస్థల చైర్మన్ చెప్యాల నర్సింహులు గౌడ్, అకాడమిక్ డైరెక్టర్ సాయిబాబా లు పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు తయారు చేసి ప్రదర్శించిన పలు ఆహార పదార్థాలను తిలకించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు పోషక విలువల ప్రాముఖ్యత , పరిశుభ్రత గురించి తెలుస్తుందన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ఉపాధ్యాయులు, విద్యార్థులు , సహకరించిన తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శిల్ప, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




# హనీట్రాప్ ఉచ్చు నుంచి తప్పించుకున్న వ్యాపారి..

## కటకటాల్లోకి నిందితులు

మెట్‌పల్లి పట్టణం: జగిత్యాల జిల్లా మెట్‌పల్లిలో హనీ ట్రాప్ ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. పట్టణంలోని ఓ వ్యాపారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన పోలీసులు నిందితులను అరెస్టు చేశారు. మెట్‌పల్లి పట్టణానికి చెందిన ఓ వ్యాపారికి కొన్ని రోజుల క్రితం ఓ మహిళ ఫోన్ చేసి ప్రేమగా మాట్లాడింది. మాటలు కలిపి పరిచయం పెంచుకుంది. ఆ తర్వాత పట్టణ శివారులో ఓ గదిని అద్దెకు తీసుకొని ఇద్దరూ ఏకాంతంగా గడిపారు. ఆ సమయంలో హనీట్రాప్ ముఠా సభ్యులు వీడియోలు, ఫోటోలు తీశారు. మరుసటి రోజు సదరు వ్యాపారికి వీడియో, ఫొటోలు వాట్సప్ చేసి.. రూ.పదిలక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డబ్బులు ఇవ్వకపోతే ఫొటోలు వైరల్ చేస్తామని బెదిరించారు. ఆ ముఠాకు భయపడకుండా.. వ్యాపారి ధైర్యంగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి రంగంలోకి దిగిన పోలీసులు పూర్తి స్థాయిలో దర్యాప్తు చేసి ఆరుగురిపై కేసు నమోదు చేశారు. మహిళతో పాటు మరో ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. ఈ ముఠాకు చెందిన మరో ముగ్గురు పరారీలో ఉన్నట్టు పోలీసులు తెలిపారు. నిందితుల నుంచి నాలుగు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్ నమ్మి మోసపోవద్దని సీఐ అనిల్ కుమార్ ప్రజలకు సూచించారు. ఎవరైనా ఇలాంటి వేధింపులకు గురి చేస్తే భయపడకుండా నేరుగా పోలీసులను సంప్రదించాలన్నారు.




# రాజ్‌పథ్‌లో మార్మోగనున్న ‘అందె’ డప్పు దరువు

మిరుదొడ్డి: తెలంగాణ మట్టి కళారూపం, అణగారిన వర్గాల ఆత్మఘోషకు ప్రతీక అయిన ‘డప్పు’ మరోసారి దేశ రాజధానిలో మారుమోగనుంది. సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం అందే గ్రామానికి చెందిన ప్రముఖ డప్పు కళాకారుడు, ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ యువ పురస్కార గ్రహీత అందే (అంగడి) భాస్కర్ బృందానికి అరుదైన గౌరవం దక్కింది. ఢిల్లీలో నిర్వహించే రిపబ్లిక్ డే పరేడ్‌లో ప్రదర్శన ఇచ్చేందుకు ఈ బృందానికి వరసగా మూడోసారి ఆహ్వానం అందింది.

* **తెలంగాణ సంస్కృతికి దక్కిన గౌరవం**

కేంద్ర సాంస్కృతిక శాఖ పరిధిలోని నాగ్‌పూర్ సౌత్ సెంట్రల్ జోన్ కల్చరల్ సెంటర్ (ఎస్‌సీజెడ్ సీసీ) నుంచి బుధవారం అధికారిక ఆహ్వానం అందింది. దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన అత్యుత్తమ కళారూపాల మధ్య, తెలంగాణ తరపున ప్రాతినిధ్యం వహించే అవకాశం రావడం విశేషం. రాష్ట్రపతి, ప్రధానమంత్రి, ఉప రాష్ట్రపతి వంటి ప్రముఖులు పాల్గొనే ఈ వేడుకలో తెలంగాణలోని మారుమూల పల్లె నుంచి వచ్చిన కళాకారులు తమ ప్రతిభను చాటనున్నారు.

**హర్షం వ్యక్తం చేసిన కళాకారులు**

వరసగా మూడో ఏడాది కూడా జాతీయ వేదికపై ప్రదర్శనకు అవకాశం దక్కడంపై అందె భాస్కర్ ఆనందం వ్యక్తం చేశారు. తెలంగాణ మట్టి వాసన, డప్పు దరువును ఢిల్లీ వేదికగా వినిపించే అవకాశం రావడం తమ అదృష్టంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. తమ కళను గుర్తించి ప్రోత్సహిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఆహ్వానంతో సిద్దిపేట జిల్లాతో పాటు తెలంగాణ రాష్ట్ర ఖ్యాతి జాతీయ స్థాయిలో మరోసారి వెలుగులోకి వచ్చినట్లు అయిందని అన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు అందె భాస్కర్ బృందానికి అభినందనలు తెలిపారు.



# మునగచర్లలో రాష్ట్రస్థాయి పైలెట్ ప్రాజెక్టు యానిమల్ హాస్టల్ పనుల పరిశీలన

* **రూ.10 లక్షల వ్యయంతో సామూహిక పశువుల షెడ్డు నిర్మాణం – పాడి రైతులకు భరోసా.**

నందిగామ మండలం మునగచర్ల గ్రామంలో రాష్ట్రంలోనే పైలెట్ ప్రాజెక్టుగా రూ.10 లక్షల రూపాయల వ్యయంతో నిర్మాణంలో ఉన్న సామూహిక పశువుల షెడ్డు (యానిమల్ హాస్టల్) పనులను ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు శ్రీమతి గద్దె అనురాధ గారు, విజయవాడ పార్లమెంట్ సభ్యులు శ్రీ కేశినేని శివనాథ్ (చిన్ని) గారు, జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య గారు, విజయ డైరీ చైర్మన్ శ్రీ చలసాని ఆంజనేయులు గారు, విజయ డైరీ డైరెక్టర్లు మరియు కూటమినేతలతో కలిసి పనులను సందర్శించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే శ్రీమతి తంగిరాల సౌమ్య గారు ఈ





సందర్భంగా యానిమల్ హాస్టల్ నిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలతో వేగంగా పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. ఈ సామూహిక పశువుల షెడ్డు పూర్తయితే గ్రామంలోని పాడి రైతులకు పెద్ద ఎత్తున లాభం చేకూరుతుందని, పశువులకు సురక్షిత నివాసంతో పాటు మెరుగైన సంరక్షణ లభిస్తుందని తెలిపారు.రాష్ట్రంలోనే ప్రయోగాత్మకంగా చేపడుతున్న ఈ ప్రాజెక్టు విజయవంతమైతే, భవిష్యత్తులో మరిన్ని గ్రామాల్లో అమలు చేసే అవకాశం ఉందని పేర్కొన్నారు. పాడి పరిశ్రమను బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, రైతుల ఆదాయం పెంపుదలకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆమె అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పంగులూరి నరసింహారావు, వ్యవసాయ మార్కెట్ కమిటీల రాష్ట్ర ఉపాధ్యక్షులు కోగంటి వెంకట సత్యనారాయణ బాబు, వార్డు మెంబర్లు, కూటమి నేతలు,స్థానిక ప్రజాప్రతినిధులు,అధికారులు, పాడి రైతులు పాల్గొని ప్రాజెక్టుపై హర్షం వ్యక్తం చేశారు.

## నూతనసంవత్సర ముందస్తు వేడుకలలో పాల్గొన్న తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.వి.బి.రాజేంద్ర ప్రసాద్

ఉయ్యూరు 6వ వార్డులోని అమ్మనాకాలనీ వాసులు మరియు 10,12,15 వార్డులలో టీడీపీ నాయకులు ఏర్పాటుచేసిన 2026 నూతనసంవత్సర ముందస్తు వేడుకలలో మాజీ ఎమ్మెల్సీ వై.వి.బి.రాజేంద్ర ప్రసాద్ గారు పాల్గొని కేక్ కట్ చేసి ప్రజలందరికీ నూతనసంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాజేంద్ర ప్రసాద్ గారు మాట్లాడుతూ.. ఈ నూతన సంవత్సరంలో ప్రజలందరి ఆకాంక్షలు నెరవేరాలని అందరూ సుఖశాంతులతో అష్టైశ్వర్యాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. యువత నూతనసంవత్సర వేడుకలు కుటుంబసభ్యులతో సాంప్రదాయ బద్ధంగా జరుపుకోవాలని కోరారు. అనంతరం ఆయా వార్డుల నాయకులు రాజేంద్ర ప్రసాద్ గారిని ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఉయ్యూరు పట్టణ పార్టీ అధ్యక్షుడు జంపాన గుర్నాథరావు, క్లస్టర్ ఇంచార్జి కూనపరెడ్డి వాసు, సయ్యద్ అజ్మతుల్లా, రాజులపాటి ఫణి, పల్యాల శ్రీను, బూరెల నరేష్, పల్యాల రమేష్, బూరెల రవి, రామనోళ్ల శ్రీకాంత్, నేనావత్ రవి, కన్నారరావు, కూనపరెడ్డి రవి, బాజాని వెంకటేష్, బోల్లగుర్నాధరావు, వల్లూరి శివ, మురాల అయ్యా, మాదినేని జ్యోతి, పానుగంటి శ్రీమన్నారాయణ (పండు), కూనపరెడ్డి సత్యన్నారాయణ, భాస్కరరావు, నరేష్, సీహెచ్.ఆంజనేయులు, సీహెచ్.కోటేశ్వరరావు, వసంత్, మారగాని శివశంకర్, రాఘవేంద్రరావు, సుబ్బారావు, మాగంటి రమేష్, ఏ.రాఘవేంద్రరావు, సీహెచ్ మణి టీడీపీ నాయకులు కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## ఈడీ సోదాలు..
## కట్టలకొద్దీ నగదు, సూట్‌కేసు నిండా వజ్రాభరణాలు!

మనీ లాండరింగ్ కేసుకు సంబంధించి ఢిల్లీలోని ఓ ఇంట్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ నిర్వహించిన సోదాల్లో భారీ మొత్తంలో నగదు, ఆభరణాలు లభ్యమయ్యాయి. ఓ సూట్‌కేసులోనే రూ.8.80 కోట్ల విలువైన బంగారు, వజ్రాభరణాలు ఉండటం గమనార్హం. వీటితోపాటు రూ.కోట్లాది విలువైన ఆస్తులకు సంబంధించిన దస్త్రాలను స్వాధీనం చేసుకున్నట్లు ఈడీ అధికారులు వెల్లడించారు. హరియాణాకు చెందిన ఇందర్‌జిత్ సింగ్ యాదవ్ పలు కేసుల్లో నిందితుడు. యూఏఈ నుంచి కార్యకలాపాలు నిర్వహిస్తున్న అతడు ప్రస్తుతం పరారీలో ఉన్నాడు. ఈ క్రమంలో





డిసెంబర్ 30న ఢిల్లీలోని సర్వప్రియా విహార్‌లో ఉన్న ఇందర్‌జిత్ సన్నిహితుడి నివాసంలో ఈడీ సోదాలు మొదలుపెట్టింది. భారీ మొత్తంలో నగదు, బంగారు ఆభరణాలు గుర్తించింది.

## మహారాష్ట్ర నూతన డీజీపీగా '26/11 హీరో'



మహారాష్ట్ర నూతన డీజీపీగా సీనియర్ ఐపీఎస్ అధికారి సదానంద్ దాతే ను నియమిస్తూ ఆ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుత డీజీపీ రష్మీ శుక్లా జనవరి 3న పదవీ విరమణ చేయనుండగా.. అదే రోజు దాతే బాధ్యతలు చేపట్టనున్నారు. 26/11 ముంబయి దాడుల్లో వీరోచిత పోరాటం చేసిన ఈ సీనియర్ ఐపీఎస్ రాష్ట్ర డీజీపీగా రెండేళ్లపాటు కొనసాగనున్నారు. 1990 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి సదానంద్ దాతే.. నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ డైరెక్టర్ జనరల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. కేంద్రంపై ఒత్తిడి తెచ్చిన మహారాష్ట్ర ప్రభుత్వం.. ఆయన్ను రాష్ట్ర కేడర్‌కు బదిలీ చేయించుకుంది. నాటి 26/11 ముంబయి దాడుల్లో వీరోచిత పోరాటం చేసినందుకు గాను గతంలో దాతేను రాష్ట్రపతి పతకం వరించింది. మహారాష్ట్ర ఏటీఎస్ చీఫ్‌గా పనిచేసిన ఆయన.. సీబీఐ, సీఆర్‌పీఎఫ్‌లలోనూ పలు హోదాల్లో సేవలందించారు. పుణె విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ అందుకున్నారు. ముంబయిలో సెంట్రల్ జోన్ అడిషనల్ కమిషనర్‌గా ఆయన బాధ్యతలు నిర్వర్తిస్తున్న సమయంలోనే ఉగ్రదాడులు చోటుచేసుకున్నాయి.

## తాగి తూలుతుంటే.. ఇంటిదగ్గర దిగబెడతాం

**: కర్ణాటక హోంమంత్రి**

నూతన సంవత్సర వేడుకల్లో మునిగిపోయి మితిమీరి మద్యం సేవించినవారితో ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసేందుకు కర్ణాటక ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వారిని వారి ఇళ్ల దగ్గర దింపుతామని రాష్ట్ర హోంమంత్రి జి.పరమేశ్వర వెల్లడించారు. బెంగళూరు పోలీసులు ఈ బాధ్యతలు చూసుకుంటారని చెప్పారు. ప్రతి ఒక్కరిని ఇంటివద్ద వదలడం వీలుకాదు కాబట్టి.. మత్తు దిగేవరకు వారిని ఉంచడానికి 15 ప్రాంతాలను ఎంపిక చేసినట్లు చెప్పారు. తాగినమైకంలో అసభ్యంగా ప్రవర్తించేవారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా బార్లు, పబ్‌లలో



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. "కొన్ని జిల్లాలతో సమస్య లేదు కానీ.. రద్దీ ఎక్కువగా ఉండే బెంగళూరు, మైసూర్, హుబ్బళి, బెలగావి, మంగళూరులో ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేశాం'' అని చెప్పారు. ఈ ఏర్పాట్లపై ఇప్పటికే డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ అప్‌డేట్ ఇచ్చారు. "ట్రాఫిక్, మహిళల భద్రతను దృష్టిపెట్టుకొని బెంగళూరు వ్యాప్తంగా 20 వేలమంది పోలీసు సిబ్బందిని మోహరించాం. వారిలో ప్రత్యేకంగా శిక్షణ పొందిన మహిళా బృందం కూడా ఉంది. అలాగే అధునాతన సాంకేతికతను వినియోగిస్తున్నాం'' అని వెల్లడించారు. ఇదిలా ఉంటే.. నూతన సంవత్సర వేడుకల్లో మద్యం తాగిన వారికి ఉచిత రవాణా సేవలు అందించనున్నట్లు తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫాం వర్కర్స్ యూనియన్ (టీజీపీడబ్ల్యూయూ) తెలిపిన సంగతి తెలిసిందే. దీనికోసం క్యాబ్‌లు, ఆటోలు, ఈవీ బైక్‌లు కలిపి మొత్తం 500 వాహనాలను సిద్ధం చేసినట్లు పేర్కొంది.

## చైనా ప్రకటన ఆందోళన కలిగిస్తోంది: కాంగ్రెస్



భారత్‌పాకిస్థాన్ మధ్య తలెత్తిన ఉద్రిక్తతల నివారణకు తామే మధ్యవర్తిత్వం నడిపామని చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ చేసిన ప్రకటనను భారత ప్రభుత్వ వర్గాలు ఖండించిన సంగతి తెలిసిందే. ఈ పరిణామాల వేళ కాంగ్రెస్ స్పందించింది. చైనా ప్రకటన ఆందోళన కలిగిస్తోందని, దీనిపై కేంద్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు పార్టీ జనరల్ సెక్రటరీ జైరాం రమేశ్ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. "భారత్‌పాకిస్థాన్ మధ్య ఘర్షణలను తానే ఆపానని చాలాసార్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించుకున్నారు. పలు అంతర్జాతీయ వేదికలపై ఇప్పటివరకు 65 సార్లు ఆ మాట అన్నారు. అయినా ప్రధాని మోదీ మాత్రం మౌనం వీడటం లేదు. ఇక ఇప్పుడు చైనా విదేశాంగ మంత్రి అదే ప్రకటన చేశారు. ఇవన్నీ ఆందోళనకర ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి'' అని పేర్కొన్నారు.

## న్యూ ఇయర్ వేళ కలకలం..
## కారులో 150 కిలోల పేలుడు పదార్థాలు స్వాధీనం!

నూతన సంవత్సరం వేళ రాజస్థాన్‌లో పెద్దఎత్తున పేలుడు పదార్థాలు లభ్యం కావడం కలకలం రేపింది. ఓ కారులో 150 కిలోల అమ్మోనియం నైట్రేట్, ఇతర పేలుడు పదార్థాలను తరలిస్తుండగా.. పోలీసులు మార్గమధ్యంలో అడ్డుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓ కారులో నిందితులు పేలుడు పదార్థాలు తరలిస్తున్నట్లు టోంక్ జిల్లా పోలీసులకు నిఘావర్గాల నుంచి సమాచారం అందింది. ఈ క్రమంలోనే బరోని పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ అనుమానాస్పద కారులో తనిఖీలు నిర్వహించారు. వాహనంలో యూరియా సంచుల్లో 150 కిలోల అమ్మోనియం నైట్రేట్ నింపి ఉంచినట్లు గుర్తించారు. అదేవిధంగా 200 కాట్రిడ్జ్‌లు, ఆరు కట్టల (1,100 మీటర్లు) సేఫ్టీ ఫ్యూజ్ వైర్ స్వాధీనం చేసుకున్నారు. వాహనాన్ని సీజ్ చేశారు. ఈ ఘటనలో ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. వారిని బూంది



జిల్లాకు చెందిన సురేంద్ర పట్వా, సురేంద్ర మోచీలుగా గుర్తించారు. ఈ పేలుడు పదార్థాలను బూంది నుంచి టోంక్‌కు తరలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఆ పేలుడు పదార్థాలను ఎక్కడినుంచి సేకరించారు? చట్టవిరుద్ధ కార్యకలాపాలకు వినియోగించాలనుకున్నారా? తదితర వివరాలను రాబట్టే దిశగా దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించారు.

## సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ సజీవ దహనం కేసు.. భార్యతో సహా ఆరుగురు మహిళలకు జీవితఖైదు

జగిత్యాల: హైదరాబాద్‌లోని అల్వాల్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీరు రాచర్ల పవన్‌కుమార్(38) సజీవదహనం కేసులో జగిత్యాల జిల్లా న్యాయస్థానం సంచలన తీర్పు ఇచ్చింది. మృతుడి భార్యతో పాటు మరో ఐదుగురు మహిళలకు జీవితఖైదు విధిస్తూ న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు.

**చేతబడి నెపంతో దారుణం..**

జగిత్యాలకు చెందిన విజయ్.. కొండగట్టుకు దాదాపు 1.5 కిలోమీటర్ల దూరంలో మంజునాథ ఆలయాన్ని, దాని పక్కనే కుటీరాన్ని నిర్మించుకున్నారు. విజయ్ తమ్ముడు జగన్ అనారోగ్యంతో మృతి చెందారు. విజయ్ కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు బావ పవన్‌కుమార్, భార్య కృష్ణవేణితో కలిసి 2020 అక్టోబరు 28న రాత్రి మంజునాథ ఆలయానికి చేరుకున్నారు. పవన్‌కుమార్ చేతబడి చేయించి తన భర్తను చంపించాడనే అనుమానంతో అక్కడే ఉన్న జగన్ భార్య సుమలత బంధువులతో కలిసి అతన్ని కుటీరంలోని ఓ గదిలో బంధించింది. అందరూ కలిసి.. పవన్ ఒంటిపై పెట్రోలు పోసి



నిప్పంటించారు. పోలీసులు వచ్చి గది తాళం తీసే సరికే పవన్‌కుమార్ పూర్తిగా దహనమయ్యారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. పవన్ కుమార్ భార్య కృష్ణవేణితో పాటు మరో ఐదుగురి మహిళలను నిందితులుగా చేరుస్తూ ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. సాక్ష్యాధారాలు పరిశీలించిన జగిత్యాల మొదటి అదనపు న్యాయమూర్తి ఎస్. నారాయణ ఆరుగురు మహిళలకు జీవిత ఖైదు, రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు వెలువరించారు.

# డబ్బు విషయంలో.. ఈ పొరపాట్లు వద్దు!

**సానుకూల ఆలోచనలు సానుకూల ఫలితాల్నిస్తాయంటారు. మనం చేసే పనులు, ఎంచుకున్న లక్ష్యాల పరంగానే కాదు.. డబ్బుకూ ఈ సూత్రం వర్తిస్తుందంటున్నారు నిపుణులు. ఆర్థిక విషయాల్లో కొన్ని పొరపాట్లు చేయకుండా పాజిటివ్ మైండ్‌సెట్‌తో ఉండడం వల్ల డబ్బు సమస్యల్లేకుండా ముందుకు సాగడంతో పాటు భవిష్యత్తుకు ఆర్థిక భరోసా అందించచ్చంటున్నారు. మరి, అదెలాగో తెలుసుకుందాం రండి..**



### పోలికలొద్దు!

కొంతమంది ప్రతి విషయంలో ఎదుటివారితో పోల్చుకుంటుంటారు. అవి వస్తువులైనా, మరేదైనా సరే.. తమకు ఉండి ఇతరులకు లేని వాటిని పక్కన పెట్టి.. ఇతరుల వద్ద ఉన్న వాటి పైనే దృష్టి పెడుతుంటారు. ఈ క్రమంలో తమ ఆర్థిక స్థోమతనూ లెక్క చేయరు. అవసరానికి మించి అప్పులు చేయడానికీ వెనకాడరు. దీనివల్ల డబ్బు వృథా అవడంతో పాటు మానసిక సంతోషం కూడా దూరమవుతుంది. కాబట్టి ఇతరులతో పోల్చుకోవడం మాని.. ఆర్థికంగా మనం ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నామో ముందు పరిశీలించుకోవడం మంచిదంటున్నారు నిపుణులు. అలాగే మనకొచ్చే ఆదాయాన్ని బట్టి.. ఖర్చులు, పొదుపుమదుపులు ప్లాన్ చేసుకుంటే అనవసరంగా అప్పులపాలు కావాల్సిన ముప్పు తప్పుతుంది. ఇలా ఉన్నంతలోనే సానుకూల ఆలోచనలు చేస్తే.. భవిష్యత్తులో ఆర్థిక ఇబ్బందులు ఎదురుకాకుండా జాగ్రత్తపడచ్చు.



### సాధ్యాసాధ్యాల్ని పరిశీలించాకే..!

ఏ విషయంలోనైనా సరే.. ముందుగా మన ఆర్థిక పరిస్థితుల్ని బట్టి సాధ్యాసాధ్యాల్ని పరిశీలించుకోవాలంటున్నారు నిపుణులు. డబ్బు విషయంలో ఇదీ ఓ సానుకూల ఆలోచనే అంటున్నారు. ఉదాహరణకు మన స్థోమతకు తగ్గట్లుగా ఎంత పెద్ద ఇల్లు కొనాలో బేరీజు వేసుకోవడం, గొప్పలకు పోకుండా.. మన వద్ద ఉన్న డబ్బును బట్టే ఇంటీరియర్ చేయించుకోవడం, ఇతర వస్తువులు కొనుక్కోవడం మంచిది. ఫలితంగా ఎలాంటి సమస్యలు రావు.. తద్వారా ఎలాంటి ఒత్తిళ్లు లేకుండా నెమ్మదిగా మన భవిష్యత్ లక్ష్యాలను పూర్తిచేసుకోవచ్చు.

### ఈ పొరపాట్లు వద్దు!

డబ్బు విషయంలో కొంతమంది మహిళలు చేసే కొన్ని పొరపాట్లు కూడా ఆర్థికంగా వారిపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో డబ్బు వ్యవహారాలన్నీ తమ భర్తలు/ఇతర కుటుంబ సభ్యుల చేతుల్లో పెట్టడం, తమకంటూ ప్రత్యేకంగా పొదుపు మదుపులు చేసుకోకుండా.. భాగస్వామిపై ఆధారపడడం.. వంటివి మంచిది కాదంటున్నారు. నిజానికి ఇలాంటివన్నీ చిన్న విషయాలే అనిపిస్తాయి.. కానీ సమయం వచ్చినప్పుడు అనిపిస్తుంటుంది.. 'అప్పుడే జాగ్రత్తగా ఉంటే ఈ సమస్యలన్నీ వచ్చేవి కాదు కదా!' అని. కాబట్టి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఈ పొరపాట్లేవీ చేయకుండా.. ముందుగానే ప్లాన్ ప్రకారం సానుకూల ఆలోచనలతో ముందుకు సాగడం, తమకంటూ కొంత డబ్బు వెనకేసుకోవడం.. వంటివి చేస్తే భవిష్యత్తులో ఇతరులపై ఆధారపడాల్సిన అవసరం రాదు.

### ప్రభావితం కావద్దు..!

ఆర్థిక విషయాల్లో మనకంటూ సొంత ప్రణాళికలు, లక్ష్యాలున్నప్పటికీ.. ఇతరులు చెప్పే మాటలు, చేతలు ఒక్కోసారి మనల్ని ప్రభావితం చేస్తుంటాయి. స్థోమతకు మించి ఖర్చు పెట్టేలా, అనవసర జల్సాలకు ప్రేరేపించేందుకు కారణమవుతాయి. దీనివల్ల కూడా సమస్యలు తప్పవంటున్నారు నిపుణులు. కాబట్టి ఇలాంటి వ్యక్తుల మాటలు పట్టించుకోకుండా ఉండడంతో పాటు.. ఆర్థిక విషయాల్లో సానుకూల సలహాలిచ్చే వ్యక్తులుండేలా జాగ్రత్తపడడం, అలాంటి వారితోనే స్నేహం చేయడం, పాజిటివిటీని నింపే వాతావరణం ఉండేలా చూసుకోవడం.. ఇవన్నీ ముఖ్యమే అంటున్నారు నిపుణులు.



# జొన్నలతో మేలెంతో..!

**అధిక బరువుతో బాధపడేవారు దాన్ని తగ్గించుకోవడానికి వివిధ ప్రయత్నాలు చేస్తుంటారు. కొందరు విపరీతమైన వర్కవుట్లు చేస్తే, మరికొందరు ఆహారపుటలవాట్లు మార్చుకుంటారు. ఇంకొందరైతే బరువు తగ్గాలని తిండి కూడా మానేస్తుంటారు. అయితే ఇలా నోరు కట్టేసుకొని బరువు తగ్గించుకునే బదులు కొన్ని రకాల చిరుధాన్యాలను ఆహారంలో చేర్చుకోవడం మేలంటున్నారు పోషకాహార నిపుణులు. ప్రత్యేకించి జొన్నలతో చేసిన వంటకాలను తరచుగా తీసుకోవడం ద్వారా బరువును అదుపులో ఉంచుకోవచ్చంటున్నారు. అంతేకాదు.. జొన్నలతో ఆరోగ్యపరంగా ఇతరత్రా అనేక ప్రయోజనాలున్నాయంటున్నారు నిపుణులు.**





* జొన్నల్లో గ్లూటెన్ ఉండదు. కాబట్టి ఇది మంచి ఆహారం.
* ఫైబర్ పుష్కలంగా ఉండే జొన్నలు జీర్ణ వ్యవస్థ పనితీరును మెరుగుపరుస్తాయంటున్నారు నిపుణులు.
* ఇందులో గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉండటం వల్ల రక్తంలోని చక్కెర స్థాయులను నియంత్రించడంలోనూ తోడ్పడతాయని చెబుతున్నారు.
* ప్రొటీన్లు సమృద్ధిగా ఉండే జొన్నల్ని ఆహారంలో చేర్చుకోవడం వల్ల ఎక్కువసేపు పొట్ట నిండుగా ఉండేలా చూసుకోవచ్చు. బరువు అదుపు చేసుకోవడానికి ఇదీ ఓ మార్గమే!
* వివిధ పోషకాలు పుష్కలంగా ఉండే జొన్నలు ఎముకల ఆరోగ్యాన్ని కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తాయంటున్నారు నిపుణులు.
* రక్తనాళాల్లో చెడు కొలెస్ట్రాల్ స్థాయులను తగ్గించి, మంచి కొలెస్ట్రాల్ స్థాయులను పెంచడంలో జొన్నలు సహకరిస్తాయట.
* ఇందులో కాంప్లెక్స్ కార్బోహైడ్రేట్స్ కలిగి ఉండటం వల్ల శరీరంలో శక్తి స్థాయుల్ని పెంచడానికి కూడా తోడ్పడతాయని చెబుతున్నారు నిపుణులు.
* ఎన్ని ప్రయోజనాలున్నప్పటికీ.. కొన్ని రకాల చిరు ధాన్యాల విషయంలో తమ శరీర తత్వాన్ని కూడా పరిగణనలోకి తీసుకుని, సంబంధిత నిపుణుల సలహా మేరకే వీటిని ఆహారంలో చేర్చుకోవడం మంచిదన్న విషయం గుర్తుంచుకోవాలి.

# ఫర్నిచర్‌పై మరకలు పోవాలంటే..!

ఎంత జాగ్రత్తగా ఉన్నా ఒక్కోసారి ఫర్నిచర్‌పై రకరకాల మరకలు పడుతుంటాయి. అలాగని సరిగా శుభ్రం చేయకపోతే ఫర్నిచర్ కళ తగ్గిపోతుందంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో ఇంట్లోని ఫర్నిచర్‌ను సులభమైన పద్ధతుల్లో శుభ్రం చేసుకోవడమెలాగో తెలుసుకుందాం..!

### టూత్‌పేస్ట్‌తో..

సాధారణంగా డైనింగ్ టేబుల్ మీద గిన్నెలు, గ్లాసులు పెట్టడం వల్ల వలయాల మాదిరిగా నీటి మరకలు ఏర్పడతాయి. వీటిని తొలగించడానికి టూత్‌పేస్ట్‌ను ఉపయోగిస్తే సరిపోతుందట. కొద్దిగా టూత్‌పేస్టుని తీసుకుని దానిని నీటితో పలుచగా అయ్యేలా కలపాలి. దీనిని మరకపై రాసి కొన్ని నిమిషాల తర్వాత మెత్తని వస్త్రంతో తుడిచేయాలి. ఈ చిట్కాని ఉపయోగించి కేవలం డైనింగ్ టేబుల్ పైనే కాదు.. కిటికీలు, తలుపులపై పడిన నీటిచుక్కల మరకల్ని కూడా వదిలించేయచ్చంటున్నారు నిపుణులు.

### ఫర్నిచర్ వ్యాక్స్‌తో..

సాధారణంగా ఫర్నిచర్‌పై ఏర్పడే మరకలు నీటి వల్లే ఏర్పడతాయి. కాబట్టి వాటిని తొలగించడానికి ఫర్నిచర్ వ్యాక్స్‌ని ఉపయోగించవచ్చు. కొద్దిగా ఫర్నిచర్ వ్యాక్స్‌ని తీసుకొని మరకపై రాసి మెత్తని వస్త్రంతో తుడిచేయడం వల్ల మంచి ఫలితం ఉంటుందంటున్నారు నిపుణులు.

### లిక్విడ్ బ్లీచ్‌తో..

చెక్కతో చేసిన ఫర్నిచర్‌పై ఏర్పడిన మరకను లిక్విడ్ బ్లీచ్‌తో తొలగించవచ్చు. ఇందుకోసం టూత్‌బ్రష్‌ను లిక్విడ్ బ్లీచ్‌లో ముంచి మరకపై సున్నితంగా రుద్దాలి. కొన్ని నిమిషాల తర్వాత మెత్తటి పొడి వస్త్రంతో తుడిచేస్తే మరక పోతుందట.

### ఇలా కూడా..!

* అరచెంచా వెనిగర్‌ని ఒక కప్పు చల్లటి నీటిలో కలపాలి. ఈ మిశ్రమంలో శుభ్రమైన వస్త్రాన్ని ముంచి మరకపై తుడవాలి.
* గోరువెచ్చని నీటిలో సబ్బు కలిపి తుడిచినా మరక చాలావరకు పోతుందట.
* కొద్దిమొత్తంలో ఉప్పు తీసుకొని ఆలివ్ ఆయిల్‌తో ముద్దలా కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని మరకపై రాసి కొంత సమయం తర్వాత తుడిచేయాలి.
* కొద్దిగా పెట్రోలియం జెల్లీని మరకపై రాసి మరుసటి రోజు వస్త్రంతో తుడిస్తే మరక వదిలిపోతుందని చెబుతున్నారు నిపుణులు.





# ఆరోగ్యానికి నిమ్మ

**వంటింట్లో అందుబాటులో ఉండే నిమ్మకాయంటే చాలామందికి చిన్న చూపే. కానీ, ఇందులో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ముఖ్యంగా దీనిలోని విటమిన్ సి వ్యాధినిరోధకశక్తిని పెంచుతుంది. జలుబు, దగ్గు వంటి వాటిని రాకుండా అడ్డుకుంటుంది. ఇందులోని పాలీఫెనాల్స్, ఫ్లేవనాయిడ్లు కణాల ఆరోగ్యాన్ని కాపాడతాయి. నరాల ఆరోగ్యానికి అవసరమైన పొటాషియం పుష్కలంగా వీటి నుంచి లభిస్తుంది. శరీరం ఇనుముని గ్రహించుకోవడానికి సాయపడుతుంది.**

# 2025కు లాభాలతో వీడ్కోలు పలికిన స్టాక్ మార్కెట్

**లాభాలతో ముగిసిన ఏడాది చివరి ట్రేడింగ్ సెషన్**

**26 వేల మార్క్ దాటిన నిఫ్టీ**

**వరుసగా పదో ఏడాది లాభాలను అందించిన నిఫ్టీ**

**ఐటీ మినహా అన్ని రంగాల్లో కొనుగోళ్ల సందడి**

**ఆకట్టుకున్న మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు**




**ముంబై:** 2025 క్యాలెండర్ ఇయర్‌కు భారత స్టాక్ మార్కెట్లు ఘనంగా వీడ్కోలు పలికాయి. బుధవారం జరిగిన ఏడాది చివరి ట్రేడింగ్ సెషన్‌లో సూచీలు లాభాలతో ముగిశాయి. ఐటీ షేర్లు స్వల్పంగా నీరసించినప్పటికీ... మిగిలిన అన్ని ప్రధాన రంగాల్లో కొనుగోళ్ల మద్దతు లభించడంతో మార్కెట్లు ఉత్సాహంగా కదిలాయి.

ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 545.52 పాయింట్లు లాభపడి 85,220.6 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 190.75 పాయింట్లు ఎగబాకి 26,129.6 వద్ద ముగిసింది. దీంతో నిఫ్టీ వరుసగా పదో ఏడాది కూడా ఇన్వెస్టర్లకు లాభాలను అందించినట్లయింది. 2025లో నిఫ్టీ మొత్తంగా 10.5 శాతం లాభపడగా, సెన్సెక్స్ 9.06 శాతం వార్షిక రాబడిని నమోదు చేసింది.

**రంగాల వారీగా..**

బీఎస్ఈలో టాటా స్టీల్, కోటక్ మహీంద్రా బ్యాంక్, టైటాన్, యాక్సిస్ బ్యాంక్ షేర్లు అత్యధిక లాభాలను ఆర్జించాయి. మరోవైపు టీసీఎస్, టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్ వంటి టెక్నాలజీ షేర్లతో పాటు బజాజ్ ఫైనాన్స్, సన్ ఫార్మా, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు నష్టాల్లో ముగిశాయి.

రంగాల వారీగా చూస్తే నిఫ్టీ ఆయిల్ అండ్ గ్యాస్ సూచీ 2.66 శాతం పెరిగి మార్కెట్ ర్యాలీకి నాయకత్వం వహించింది. బ్యాంకింగ్, రియల్టీ, మెటల్, కన్స్యూమర్ డ్యూరబుల్స్ రంగాలు 1 శాతానికి పైగా లాభపడ్డాయి. ఐటీ రంగం మాత్రం 0.3 శాతం వెనకబడింది.

మార్కెట్ అవుట్‌లుక్

నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 సూచీ ఈ ఏడాది 5.7 శాతం లాభపడి వరుసగా ఆరో ఏడాది లాభాల్లో నిలిచింది. అయితే స్మాల్‌క్యాప్ సూచీ మాత్రం 2025లో 5.6 శాతం నష్టపోయింది. ప్రస్తుతం నిఫ్టీ 26,000 మార్క్ పైన స్థిరంగా కొనసాగడం సానుకూల అంశమని మార్కెట్ నిపుణులు విశ్లేషించారు. 26,200-26,230 స్థాయిని దాటితే నిఫ్టీ తన ఆల్‌టైమ్ గరిష్ఠ స్థాయి అయిన 26,320ని మళ్లీ పరీక్షించే అవకాశం ఉందని వారు అభిప్రాయపడ్డారు.

# సమ్మె పిలుపుతో దిగొచ్చిన ఫుడ్ డెలివరీ సంస్థలు..

**డెలివరీ బాయ్స్‌కు భారీగా ఇన్సెంటివ్స్ పెంపు**

**సమ్మె పిలుపు నేపథ్యంలో డెలివరీ వర్కర్లకు భారీ ఇన్సెంటివ్స్**

**బుధవారం పీక్ అవర్స్‌లో ఆర్డర్‌కు రూ.150 వరకు ఆఫర్ చేసిన జొమాటో**

**రెండు రోజుల్లో రూ.10 వేల వరకు సంపాదించుకునే ఛాన్స్ ఇచ్చిన స్విగ్గీ**

**వేతనాలు, పని పరిస్థితులపై నిరసనగా సమ్మెకు పిలుపునిచ్చిన యూనియన్లు**




**న్యూఢిల్లీ:** నూతన సంవత్సర వేడుకల వేళ ఫుడ్ డెలివరీ దిగ్గజ సంస్థలు స్విగ్గీ, జొమాటో తమ డెలివరీ పార్ట్‌నర్లకు (గిగ్ వర్కర్లు) శుభవార్త చెప్పాయి. వేతనాలు పెంచాలని, పని పరిస్థితులు మెరుగుపరచాలని కోరుతూ డెలివరీ వర్కర్ల యూనియన్లు దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చిన నేపథ్యంలో సేవలకు అంతరాయం కలగకుండా కంపెనీలు భారీ ఇన్సెంటివ్స్ (ప్రోత్సాహకాలు) ప్రకటించాయి.

డిసెంబర్ 31న ఆర్డర్లు భారీగా పెరిగే అవకాశం ఉంది. ఈ రద్దీని దృష్టిలో ఉంచుకుని జొమాటో సంస్థ తన డెలివరీ పార్ట్‌నర్లకు బంపర్ ఆఫర్ ఇచ్చింది. సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 12 గంటల మధ్య ఉండే పీక్ అవర్స్‌లో ఒక్కో ఆర్డర్‌కు రూ.120 నుంచి రూ.150 వరకు చెల్లించనున్నట్లు తెలిపింది. ఆర్డర్ల లభ్యతను బట్టి ఒక్క రోజులోనే డెలివరీ బాయ్స్ రూ.3,000 వరకు సంపాదించుకునే అవకాశం కల్పించింది. అంతేకాకుండా ఆర్డర్లను రద్దు చేసినా లేదా తిరస్కరించినా విధించే పెనాల్టీలను తాత్కాలికంగా ఎత్తివేసింది.

భారీ ప్యాకేజీ ప్రకటించిన స్విగ్గీ

మరోవైపు స్విగ్గీ కూడా డెలివరీ వర్కర్లకు భారీ ప్యాకేజీని ప్రకటించింది. ఈరోజు, రేపు.. ఈ రెండు రోజుల్లో కలిపి డెలివరీ పార్ట్‌నర్లు రూ.10,000 వరకు సంపాదించుకునే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు తెలిపింది. ముఖ్యంగా డిసెంబర్ 31 రాత్రి పీక్ అవర్స్‌లో రూ.2,000 వరకు అదనపు పేమెంట్ ఆఫర్ చేస్తోంది. క్విక్ కామర్స్ సంస్థ జెప్టో కూడా తమ డెలివరీ సిబ్బందికి ఇన్సెంటివ్స్ పెంచింది.

ఈనెల 25న క్రిస్మస్ రోజున యూనియన్లు సమ్మె చేపట్టడంతో కొన్ని ప్రాంతాల్లో సేవలకు స్వల్ప అంతరాయం ఏర్పడింది. ఇవాళ సమ్మెను మరింత ఉద్ధృతం చేయాలని యూనియన్లు పిలుపునిచ్చాయి. ఈ నేపథ్యంలోనే కంపెనీలు డెలివరీ బాయ్స్‌ను ఆకట్టుకునేందుకు ఈ ఆఫర్లు ప్రకటించాయి.

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సోషల్ సెక్యూరిటీ కోడ్-2020 ప్రకారం గిగ్ వర్కర్లకు సామాజిక భద్రత కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అగ్రిగేటర్లు తమ వార్షిక టర్నోవర్‌లో 1-2 శాతం మేర సోషల్ సెక్యూరిటీ ఫండ్‌కు జమ చేయాల్సి ఉంటుంది. ఇటీవల స్టాక్ మార్కెట్లో స్విగ్గీ, జొమాటో మాతృసంస్థ షేర్లు స్వల్పంగా నష్టపోయాయి.

# చైనాకు షాకిచ్చిన భారత్.. స్టీల్ దిగుమతులపై పన్ను

**చైనా నుంచి దిగుమతయ్యే చౌక ఉత్పత్తులే టార్గెట్**

**న్యూఢిల్లీ:** స్టీలు ఉత్పత్తిలో ప్రపంచంలోనే రెండో స్థానంలో ఉన్న భారత్ తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. స్టీలు దిగుమతులపై పన్ను విధిస్తూ నోటిఫికేషన్ జారీ చేసింది. చైనా నుంచి దిగుమతి అవుతున్న చౌక స్టీలు ఉత్పత్తులే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకుంది. విదేశాల నుంచి.. ముఖ్యంగా చైనా నుంచి దిగుమతి అవుతున్న పలు చౌక స్టీలు ఉత్పత్తులపై 12 శాతం పన్ను విధించింది. స్టెయిన్‌లెస్ స్టీల్ వంటి ప్రత్యేక ఉక్కు ఉత్పత్తులకు కూడా ఇది వర్తిస్తుంది.

దేశీయంగా ఉక్కు తయారీదారుల ప్రయోజనాలను కాపాడేందుకు తీసుకున్న ఈ నిర్ణయంతో చైనాకు షాక్ తగలనుంది. అక్కడి నుంచి మన దేశానికి దిగుమతయ్యే వస్తువులు తగ్గనున్నాయి. చైనా, వియత్నాం, నేపాల్ దేశాలకు ఈ సుంకాలు వర్తించనుండగా పలు అభివృద్ధి చెందుతున్న దేశాలకు కేంద్రం మినహాయింపు ప్రకటించింది.

కేంద్ర ఆర్థిక శాఖ జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం.. స్టీలు ఉత్పత్తులపై దిగుమతి సుంకం మూడేళ్ల పాటు అమలులో ఉంటుంది. తొలి ఏడాది 12 శాతం పన్ను, రెండో ఏడాది 11.5 శాతం, మూడో ఏడాది 11 శాతం పన్ను వసూలు చేయనున్నట్లు పేర్కొంది.

# దంచికొట్టిన సర్ఫరాజ్ ఖాన్..

**14 సిక్సర్లతో వీరవిహారం**

**విజయ్ హజారే ట్రోఫీలో సర్ఫరాజ్ ఖాన్ 157 పరుగుల భారీ ఇన్నింగ్స్**

**56 బంతుల్లోనే సెంచరీ.. తుపాన్ ఇన్నింగ్స్‌లో 14 సిక్సర్లు, 9 ఫోర్లు**

**తమ్ముడు ముషీర్ ఖాన్‌తో కలిసి కీలక భాగస్వామ్యం**

**బౌలింగ్‌లో నిరాశపరిచిన అర్జున్ టెండూల్కర్**




**న్యూఢిల్లీ:** దేశవాళీ క్రికెట్ టోర్నీ విజయ్ హజారే ట్రోఫీలో ముంబై బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. 2025 సంవత్సరం చివరి రోజైన నేడు గోవా జట్టుతో జరిగిన మ్యాచ్‌లో సర్ఫరాజ్ విధ్వంసకర ఇన్నింగ్స్‌తో అలరించాడు. కేవలం బౌండరీలు, సిక్సర్లతో విరుచుకుపడుతూ 75 బంతుల్లోనే 157 పరుగుల భారీ వ్యక్తిగత స్కోరు సాధించాడు.

ముందుగా బ్యాటింగ్ చేపట్టిన ముంబై జట్టులో.. యశస్వి జైస్వాల్ (46) ఔటైన తర్వాత నాలుగో స్థానంలో సర్ఫరాజ్ క్రీజులోకి వచ్చాడు. ఆరంభం నుంచే దూకుడుగా ఆడిన సర్ఫరాజ్ కేవలం 56 బంతుల్లోనే తన సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఆ తర్వాత మరింత వేగంగా ఆడుతూ 150 పరుగుల మార్కును దాటాడు. అతని ఇన్నింగ్స్‌లో ఏకంగా 14 సిక్సర్లు, 9 ఫోర్లు ఉండటం విశేషం. తమ్ముడు ముషీర్ ఖాన్‌తో కలిసి 10 ఓవర్లలోనే 93 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. 209.33 స్ట్రైక్ రేట్‌తో సర్ఫరాజ్ చేసిన బ్యాటింగ్ విన్యాసంతో ముంబై జట్టు నిర్ణీత ఓవర్లలో 444 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది.

**ముంబైపై అర్జున్ టెండూల్కర్ విఫలం**

మరోవైపు గోవా తరపున ఆడుతున్న అర్జున్ టెండూల్కర్ తన సొంత జట్టు ముంబైపై ఆడిన తొలి మ్యాచ్‌లో నిరాశపరిచాడు. బౌలింగ్‌లో దారుణంగా విఫలమైన అర్జున్.. 7 ఓవర్లు వేసి వికెట్లేమీ తీయకుండా 62 పరుగులు సమర్పించుకున్నాడు.

# 6 కిలోల బరువు తగ్గిన శ్రేయాస్ అయ్యర్..

**కివీస్‌తో వన్డేలకు డౌటే**



**ముంబై:** స్టార్ బ్యాటర్ శ్రేయాస్ అయ్యర్ గ్రౌండ్‌లో అడుగుపెట్టడం మరింత ఆలస్యం అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఆస్ట్రేలియాతో జరిగిన వన్డే సిరీస్‌లో అతను గాయపడ్డ విషయం తెలిసిందే. క్యాచ్ అందుకోబోయి కింద పడ్డ అయ్యర్‌కు .. కడుపులో మోచేయి వత్తేసింది. దీంతో అతని ప్లీహం(స్ప్లీన్) దెబ్బతిన్నది. దాని నుంచి రక్తస్రావం జరిగింది. అయితే ప్రమాదం నుంచి ఇంకా కోలుకుంటున్న శ్రేయాస్ అయ్యర్.. న్యూజిలాండ్‌తో జరిగే వన్డే సిరీస్‌కు అందుబాటులో ఉంటాడన్న అనుమానాలు వ్యక్తం అయ్యాయి. కానీ ఓ నివేదిక ప్రకారం మాత్రం ప్రమాదం తర్వాత అయ్యర్ సుమారు ఆరు కిలోల బరువు తగ్గినట్లు తెలుస్తోంది. అతని మాంస కణజాలం తగ్గడం వల్ల బరువు చాలా వేగంగా కోల్పోయినట్లు డాక్టర్లు చెబుతున్నారు.

విజయ్ హజారే ట్రోఫీలో శ్రేయాస్ అయ్యర్ ఆడే అవకాశాలు ఉన్నట్లు ఓ మీడియా కథనాన్ని రాసింది. జనవరి 3, 6వ తేదీల్లో జరిగే మ్యాచుల్లో అతను ఆడుతాడని డౌట్ వ్యక్తం చేసింది. దీంతో కివీస్‌తో జరిగే వన్డే సిరీస్‌కు అయ్యర్ అందుబాటులో ఉంటాడని కూడా ఊహాగానాలు వినిపించాయి. అయితే శ్రేయార్ అయ్యర్ 50 ఓవర్ల మ్యాచ్ ఆడగలడా లేదా అన్నది సందేహంగా ఉన్నట్లు బీసీసీఐ వర్గాలు చెబుతున్నాయి. కడుపు సర్జరీ కావడం వల్ల అతను ఫిజికల్‌గా గ్రౌండ్‌లో గడపడం ఎంత వరకు వీలు అవుతుందో తెలియదన్నారు. కానీ శ్రేయాస్ మాత్రం స్కిల్ ట్రైనింగ్ ప్రారంభించాడు. ప్రస్తుతం అతని ఆరోగ్యం నిలకడగానే ఉన్నది. 50 ఓవర్లకు తగినట్లు అతను ఫీల్డింగ్ చేయగలిగితే అప్పుడు విజయ్ హజారేలో ఆడే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు.

# కోమాలో ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్




**సిడ్నీ:** ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ డామియన్ మార్టిన్ కోమాలోకి వెళ్లారు. 54 ఏళ్ల వయసున్న ఆ మాజీ బ్యాటర్.. బాక్సింగ్ డే రోజున కోమాలోకి వెళ్లినట్లు తెలుస్తోంది. మెనింజిటిస్ వ్యాధితో బాధపడుతున్న అతను క్వీన్స్‌ల్యాండ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మిడిల్ ఆర్డర్ బ్యాటర్ అయిన డామియన్ మార్టిన్ ఆస్ట్రేలియా జాతీయ జట్టు తరపున 67 టెస్టులు, 208 వన్డేలు ఆడాడు. ప్రస్తుతం డేమియన్ మార్టిన్‌కు ఇండ్యూస్డ్ కోమా పద్ధతిలో చికిత్స అందిస్తున్నారు. ఆసీస్ మాజీ క్రికెటర్లు సోషల్ మీడియాలో రియాక్ట్ అవుతున్నారు. మార్టిన్‌కు అత్యుత్తమ చికిత్స అందిస్తున్నారని, ఫ్యామిలీ ధైర్యంగా ఉండాలని ఆడమ్ గిల్‌క్రిస్ట్ తెలిపారు.

1992 నుంచి 2006 మధ్య కాలంలో ఆస్ట్రేలియా తరపున డామియన్ మార్టిన్ 67 టెస్టులు ఆడాడు. 2000 సంవత్సరంలో ఆరేళ్ల గ్యాప్ తర్వాత అతన్ని మళ్లీ జట్టులోకి తీసుకున్నారు. స్టీవ్ వా నేతృత్వంలోని ఆసీస్ జట్టులో అతను కీలక బ్యాటర్‌గా కొనసాగాడు. 2006 యాషెస్ సిరీస్ మధ్యలో అతను అకస్మాత్తుగా రిటైర్ అయ్యాడు. టెస్టుల్లో అతను 46 సగటుతో 4406 పరుగులు చేశాడు. దీంట్లో 13 సెంచరీలు ఉన్నాయి. 2003లో ఆస్ట్రేలియా వన్డే వరల్డ్‌కప్ గెలిచింది. ఆ జట్టులో మార్టిన్ ఉన్నాడు. ఇండియాతో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో మార్టిన్ 88 రన్స్ చేసి నాటౌట్‌గా నిలిచాడు. రికీ పాంటింగ్‌తో కలిసి 234 రన్స్ భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. వన్డేల్లో డామియన్ మార్టిన్ 40 సగటుతో 5346 రన్స్ చేశాడు.

# చేతిలో బీరు బాటిల్‌తో.. గోవా రోడ్లపై సారా టెండూల్కర్..



**గోవా:** భారత క్రికెట్ దేవుడు సచిన్ టెండూల్కర్ కుమార్తె సారా టెండూల్కర్ ప్రస్తుతం గోవా వెకేషన్‌లో ఉన్నారు. తన ఫ్రెండ్స్‌తో కలిసి గోవా ట్రిప్‌కు వెళ్లిన సారా.. హాలిడేను ఎంజాయ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా సారా టెండూల్కర్‌కు చెందిన ఓ వీడియో ప్రస్తుతం నెట్టింట తెగ వైరల్ అవుతోంది.

తన ఫ్రెండ్స్‌తో గోవా వీధుల్లో చక్కర్లు కొడుతున్న సారాను చూసిన నెటిజన్లు, అభిమానులు వీడియోలు తీసి సోషల్ మీడియాలో పోస్టు చేశారు. అయితే, ఆ సమయంలో సారా చేతుల్లో బీర్ బాటిల్ ఉండటం గమనార్హం. ఈ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. దీనిపై అభిమానులు, నెటిజన్లు రకరకాలుగా కామెంట్స్ చేస్తున్నారు. కొందరు పబ్లిక్‌గా బీరు బాటిల్‌తో సారా కనిపించడం పట్ల విమర్శలు గుప్పించగా.. మరికొందరు సారాకు అనుకూలంగా కామెంట్స్ చేస్తున్నారు.




## హారర్ ఫాంటసీ కామెడీ సినిమా రాలేదు

### రాజాసాబ్ మొదటి సినిమా అన్న మారుతి

**టాకీస్:** ఇప్పటివరకూ ఇండియన్ స్క్రీన్ మీద హారర్ ఫాంటసీ కామెడీ సినిమా రాలేదని రాజాసాబ్ డైరెక్టర్ మారుతి అన్నారు. రాజాసాబ్ మొదటి చిత్రం అవుతుంది. కథ రాయడానికి సంవత్సరం పట్టింది. ఏడాదిన్నర పాటు మేకింగ్.. పోస్ట్‌ప్రొడక్షన్‌కు కూడా 7 నెలలు పట్టింది. మొత్తం సినిమా నాలుగు గంటలకు పైగా వచ్చిందని మారుతి తెలిపారు. ది రాజాసాబ్' కథను చెప్పడానికి ప్రభాస్ దగ్గరకు వెళ్లినప్పుడు ఆయన 'ఆదిపురుష్' సెట్‌లో రాముడి గెటప్‌లో ఉన్నారు. వినోదాత్మక కథ ఉంటే చెప్పమన్నారు. హారర్ కామెడీ కథ ఉందని చెప్పా. ఆయన వెంటనే ఓకే అన్నారు. ఆయన ఓకే చెప్పిన తర్వాత నేను స్టోరీలో మార్పులు చేసి ఫాంటసీ ఎలిమెంట్స్ యాడ్ చేశానన్నారు. ఇటీవల జరిగిన 'ది రాజాసాబ్' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో దర్శకుడు మారుతి భావోద్వేగానికి గురైన విషయం తెలిసిందే. ప్రభాస్ గురించి చెబుతూ.. 'మీరు ఎదురుగా ఉంటే నా వల్ల కాదు..' అంటూ ఆయన భావోద్వేగంతో కన్నీరు పెట్టుకున్నారు. వెంటనే ప్రభాస్ వేదిక పైకి వచ్చి మారుతిని ఓదార్చారు. ఈ వీడియో సామాజిక మాధ్యమాల వేదికగా వైరలైంది. తాజాగా మారుతి ఓ ఇంటర్వ్యూలో దాని గురించి మాట్లాడారు. నేను ఆ సమయంలో ప్రభాస్ వేదిక పైకి వస్తారని అనుకోలేదు. నేను ఎమోషనల్ కాగానే ఆయన స్టేజ్ పైకి వచ్చి వెనకనుంచి హగ్ చేసుకున్నారు. వెంటనే 'సారీ డార్లింగ్' అని చెప్పా. 'ఫర్వాలేదు. ఈ కన్నీరు హృదయంలో నుంచి వచ్చేవి. నువ్వు ఎమోషనల్ అవుతావని ముందే ఊహించాను. నేను స్టేజ్ పైకి ఆలస్యంగా వచ్చాను. ముందే రావాల్సింది' అని ప్రభాస్ అన్నారు. ఎంత కంట్రోల్ చేసుకున్నా ఎమోషన్ ఆగలేదని మారుతి తెలిపారు.



## టాక్సిక్ మూవీలో గంగగా నయనతార

టాకీస్: యశ్ హీరోగా మలయాళ దర్శకురాలు గీతూమోహన్ దాస్ 'టాక్సిక్' చిత్రాన్ని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. 'ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్' అనేది ట్యాగ్ లైన్. ప్రస్తుతం దీని షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. తాజాగా ఈ సినిమాలో నయనతార లుక్‌ను టీమ్ రిలీజ్ చేసింది. ఇందులో ఆమె గంగ అనే పాత్రలో కనిపించనున్నారు. ఈ విషయాన్ని తెలుపుతూ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను పంచుకున్నారు. మోడ్రన్ డ్రెస్‌లో గన్ పట్టుకొని పవర్‌ఫుల్ లుక్స్‌తో నయన్ కనిపించారు. ఈ చిత్రంలో ముగ్గురు హీరోయిన్‌లు ఉన్నట్లు మొదటినుంచి వార్తలు వస్తున్నాయి. వాటిని నిజం చేస్తూ చిత్రబృందం ముగ్గురు హీరోయిన్ల లుక్‌లను వరుసగా విడుదల చేసింది. కియారా ఆడ్వాణీ నదియా పాత్రలో కనిపించనుండగా హ్యూమా ఖురేషీ ఎలిజబెత్ పాత్రలో అలరించనున్నారు. చిన్నారుల కోసం ఎన్నో కథలు తెరకెక్కాయని, ఇది పెద్దలకు సందేశమిచ్చే చిత్రమని యశ్ ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. ఆయన 19వ చిత్రంగా 'టాక్సిక్' తెరకెక్కుతోంది. వచ్చే ఏడాది మార్చి 19న ప్రేక్షకుల ముందుకురానుంది. 'కేజీయఫ్' తర్వాత యశ్ నటిస్తున్న సినిమా కావడంతో దీనిపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి.

## యువ నటి సి.ఎం. నందిని అనుమానాస్పద మృతి..

### డైరీలో బయటపడ్డ సంచలన విషయాలు



**టాకీస్:** కన్నడ బుల్లితెర పరిశ్రమలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. వర్ధమాన నటి, 26 ఏళ్ల సి.ఎం. నందిని బెంగళూరులోని కెంగేరి ప్రాంతంలో తాను నివసిస్తున్న వసతి గృహంలో సోమవారం తెల్లవారుజామున అనుమానాస్పద స్థితిలో మృతిచెందినట్లు గుర్తించారు. ప్రాథమిక సమాచారం ప్రకారం ఆమె ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. ఈ ఘటన కన్నడ చిత్ర, టెలివిజన్ రంగాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, నందిని మృతి చెందిన గదిలో ఆమె రాసిన ఒక డైరీ నోట్ లభ్యమైంది.

ఆ నోట్‌లో ఆమె ఎదుర్కొన్న మానసిక సంఘర్షణ, ఒత్తిడి స్పష్టంగా వ్యక్తమైందని పోలీసులు వెల్లడించారు. 2021లో తన తండ్రి మరణించిన అనంతరం, కారుణ్య నియామకం కింద నందినికి ప్రభుత్వ ఉద్యోగం లభించిందని, అయితే ఆ ఉద్యోగం తనకు ఇష్టం లేదని, నటన మరియు సృజనాత్మక రంగంపైనే తన జీవితం ఆధారపడి ఉందని ఆమె నోట్‌లో పేర్కొన్నట్లు సమాచారం. నటన వైపు కెరీర్‌ను కొనసాగించాలని నందిని కోరుకున్నప్పటికీ, కుటుంబ సభ్యులు మాత్రం స్థిరమైన ప్రభుత్వ ఉద్యోగంలోనే కొనసాగాలని ఆమెపై ఒత్తిడి తెచ్చినట్లు తెలుస్తోంది. తన కెరీర్ ఎంపికలను కుటుంబం అర్థం చేసుకోవడం లేదని, ఇష్టం లేని పనిని బలవంతంగా చేయాల్సి వస్తోందని ఆమె డైరీలో ఆవేదన వ్యక్తం చేసినట్లు పోలీసులు తెలిపారు.



## ప్రభాస్-పవన్ మల్టీస్టారర్ చిత్రం.. హీరోయిన్‌గా అందాల నిధి అగర్వాల్..!

టాకీస్: 'రాజా సాబ్' సినిమాతో ప్రేక్షకులను మరోసారి ఎంటర్‌టైన్ చేయడానికి సిద్ధమవుతోంది హీరోయిన్ నిధి అగర్వాల్. ప్రభాస్ హీరోగా తెరకెక్కుతున్న ఈ హారర్ థ్రిల్లర్ మూవీలో ముగ్గురు హీరోయిన్లలో ఒకరిగా నిధి నటించింది. 2026 సంక్రాంతి కానుకగా జనవరి 9న ఈ సినిమా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో చిత్ర ప్రమోషన్లలో భాగంగా నిధి అగర్వాల్ ఎక్స్ (ట్విటర్) వేదికగా అభిమానులతో ముచ్చటించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ఇటీవల పవన్ కల్యాణ్ సరసన 'హరి హర వీరమల్లు' చిత్రంలో నటించిన నిధి, ఇప్పుడు ప్రభాస్‌తో 'రాజా సాబ్'లో కనిపించనుంది. ఆదివారం (డిసెంబర్ 28) సాయంత్రం ఎక్స్‌లో ఫ్యాన్స్ అడిగిన ప్రశ్నలకు సరదాగా సమాధానాలు ఇస్తూ, తన మనసులోని కోరికలను కూడా బయటపెట్టింది.
ఈ సందర్భంగా ఓ అభిమాని "తెలుగులో మీ డ్రీమ్ మల్టీస్టారర్ కాంబినేషన్ ఏది?" అని అడగ్గా, నిధి స్పందిస్తూ "పవన్ కల్యాణ్ సర్, ప్రభాస్ సర్, నేను.. డైరెక్షన్ సందీప్ రెడ్డి వంగా' అంటూ సమాధానం ఇచ్చింది. ఈ కామెంట్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అభిమానులతో సరదాగా మాట్లాడిన నిధి, బ్రేక్‌ఫాస్ట్ డేట్ ప్రశ్నకూ ఆసక్తికరంగా స్పందించింది. "ఇడ్లీ కోసం పూర్ణ టిఫిన్ సెంటర్‌కు ఎప్పుడు వెళ్తారు?" అన్న ప్రశ్నకు "రేపు? బ్రేక్‌ఫాస్ట్ డేట్" అంటూ రిప్లై ఇచ్చింది. మరో అభిమాని డిన్నర్‌కు తీసుకెళ్తే ఎలా ఉంటుందని అడగ్గా, "ఎప్పుడు వెళ్దామనుకుంటున్నారు? ప్లాన్ చేయండి" అంటూ నవ్వులు పూయించింది.
ఇదిలా ఉండగా, ప్రభాస్ సినిమాలపై తన అభిప్రాయాన్ని కూడా నిధి వెల్లడించింది. "ప్రభాస్ మూవీస్‌లో మీకు ఎక్కువగా నచ్చిన సినిమా ఏది?" అని అడిగిన ప్రశ్నకు ఆమె 'సలార్' అని సమాధానమిచ్చింది. అలాగే ప్రభాస్‌ను "ఇండియాలోనే బిగ్గెస్ట్ సూపర్ స్టార్"గా పేర్కొన్న నిధి .. పవన్ కల్యాణ్, ప్రభాస్ ఇద్దరూ తమ అభిమానులను అమితంగా ప్రేమిస్తారని ప్రశంసించింది.

## నువ్వు నాకు నచ్చావ్..నేడు రీరిలీజ్

టాకీస్: 'కొన్ని సినిమాలు డబ్బులు... మరికొన్ని సినిమాలు పేరునీ తీసుకొస్తాయి. గౌరవం మాత్రం చాలా కొన్ని సినిమాలే తీసుకొస్తాయి. 'నువ్వు నాకు నచ్చావ్' అలాంటి ఓ ప్రత్యేకమైన గౌరవాన్ని తీసుకొచ్చిన సినిమా అన్నారు ప్రముఖ దర్శకుడు త్రివిక్రమ్. ఆయన రచయితగా, విజయ్ భాస్కర్.కె దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రమిది. వెంకటేశ్, ఆర్తి అగర్వాల్ జంటగా నటించారు. స్రవంతి రవికిశోర్ నిర్మాత. ఈ చిత్రం జనవరి 1న రీరిలీజ్‌గా మరోసారి ప్రేక్షకల ముందుకొస్తోంది. ఈ నేపథ్యంలోనే చిత్రబృందం మంగళవారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా నిర్మాత స్రవంతి రవికిశోర్ మాట్లాడుతూ ఈ సినిమా విడుదలై పాతికేళ్లయింది. ఇప్పటికీ 'నువ్వు నాకు నచ్చావ్' నిర్మాత అంటే నన్ను చూసే విధానం వేరుగా ఉంటుంది. ఈ సినిమా రూపొందడానికీ, ఇంత బాగా రావడానికి ప్రధాన కారణం వెంకటేశ్. నటుడిగా ఎంతో అద్భుతంగా చేశారు. ఇతర నటులు, దర్శకుడు విజయ్‌భాస్కర్, రచయిత త్రివిక్రమ్, సంగీత దర్శకుడు కోటి... ప్రతి ఒక్కరి అత్యుత్తమ పనితీరు ఇందులో కనిపిస్తుంది. అందుకే ఈ సినిమా ఇప్పటికీ అలా నిలిచిపోయింది. ఇప్పటిలా అప్పుడు ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ ఇతరత్రా దేశాల్లో విడుదల చేయలేదు. ఇప్పుడు మాత్రం అన్ని ప్రాంతాల్లోని ప్రేక్షకులూ చూసి ఆస్వాదించేలా భారీస్థాయిలో విడుదలకు సిద్ధం చేశాం' అన్నారు.త్రివిక్రమ్ మాట్లాడుతూ ఈ సినిమా క్రెడిట్ అంతా కథానాయకుడు వెంకటేశ్‌కే దక్కుతుంది. కథ చెప్పిన వెంటనే ఆయన చేస్తానని ముందుకొచ్చారు. అందరి జీవితాల్లో భాగమైన ఓ సినిమా ఇది. కుటుంబ ప్రేక్షకులంతా కలిసి ఓటీటీ, టీవీ మాధ్యమాల్లో చూశారు. సామూహిక అనుభవం కోసం అందరూ కలిసి మరోసారి థియేటర్లలో చూస్తారు' అన్నారు.




Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.